# లోకవిద్య



# లోకవిద్య



విద్యా ఆశ్రమం

సారనాథ్ , వారణాసి - 22100

**విజ్ఞాన భారత రాజకీయ పుస్తకమాల**

( హిందీ నుంచి తెలుగు అనువాదము )

విలువ : 10 రూపాయలు

Publisher : **Dr. CHITRA SAHASRABUDEY**
on behalf of Vidya Ashram,
10/82 A Ashok Marg Sarnath,
Varanasi - 221007.
Phone : 0542- 2595120
website : vidyaashram.org

# విద్యావంతుడే బలవంతుడు

బీచుపల్లి గ్రామంలో కృష్ణానదీ తీరాన ఇరుగుపొరుగు గ్రామాల నుంచీ 20–25 మంది గ్రామస్తులు సమావేశమయ్యారు. ఇందులో రైతులు, చేనేత కార్మికులు, కూలీలు, నిరుద్యోగులూ వున్నారు. మాటల్లో తమతమ రంగాల్లో వున్న సమస్యలన్నీ చర్చిస్తూ ఆర్థిక సంక్షోభం, ప్రభుత్వ నిర్లక్ష్యం, నష్టాలవైపు దృష్టి సారించారు. ఇటీవలే జరిగిన చేనేత రైతుల కుటుంబాల ఆత్మహత్యలపై మాట్లాడుతుండగానే సాయం సంధ్య చీకట్లు ముసురుకోసాగాయి. ఎటువంటి నిర్ణయాలు తీసుకోకుండానే సమావేశం ముగిసింది. కానీ రెండు రోజుల తర్వాత మళ్లీ కలుసుకోవాలని నిర్ణయం జరిగింది. ఆ రోజు రాత్రి భోజనం తర్వాత కొంతమంది గ్రామస్తులు తమ సందేహాలను దూరం చేసుకునే ప్రయత్నంలో సమావేశాన్ని ఏర్పాటు చేసిన కార్యకర్తలతో ఈ విధంగా సంభాషించారు.

ప్ర : వివిధ దేశాల నాయకులు, శాస్త్రవేత్తలు, పరిపాలనా వేత్తల దృష్టిలో నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో వాతావరణ మార్పులు, కాలుష్యం ప్రధాన సమస్యగా ఉంది. కానీ మీరు దారిద్ర్యం ప్రధాన సమస్య అంటున్నారు. దీని గురించి అసలు ఎవరూ ఎందుకు మాట్లాడం లేదు?

జ : కడుపు నిండిన వాడికి ఏం తెలుస్తుంది కడుపు మాడిన వాడి బాధ? నా దృష్టిలో ప్రస్తుత సమాజంలోని మానవ దారిద్ర్యం మరియు వాతావరణ కాలుష్యాలు రెండింటికీ ఒకే కారణం ఉంది. రెండూ బలవంతంగా రుద్దబడినవే. కేవలం ఒకదాని గురించే మాట్లాడటం సరికాదు.

ప్ర : మీరు చాలా సార్లు ఈ బీదరికం కృత్రిమమైనదనీ సమాజం తల్చుకుంటే దీనిని అంతం చెయ్యవచ్చనీ అంటుంటారు. అయితే ఈరోజు సాయంత్రం సమావేశమైన వారిలో ఈ మార్పు తెచ్చే సామర్థ్యం, దమ్ము

ఉన్నాయంటారా? నాకయితే ఇది అసాధ్యమనిపిస్తోంది.

జ : వాళ్లలో దమ్ము, ధైర్యం లేవని అనలేము. కానీ ప్రతి వాడికీ అంతర్గతంగా ఉన్న బలం గురించి అవగాహన ఉండదు. దాన్ని తట్టి లేపే ప్రయ్నతం జరగాలి. ఇది అంత సులభం కాదు. అయినా ప్రయత్నించాలి.

ప్ర : ఈ బీద ప్రజల దగ్గర అంత బలం, శక్తి మీకు ఎక్కడ కనిపిస్తున్నాయి.

జ : కొన్ని ప్రాంతీయ భేదాలున్నప్పటికీ బీద ప్రజలంటే రైతులు, ఆదివాసీలు, చేతివృత్తిదారులు, చిన్న దుకాణదారులూ ఉంటారు. వీరి దగ్గర ఆధునిక విద్య, ధనం ఉండదు. కానీ వీరి బలమంతా వీరి వృత్తి నైపుణ్యంలో ఉంది. వీరిని చదువురాని వారిగా, లేనివారిగా చూడకూడదు. వీరి దగ్గరున్న విద్యనే లోకవిద్య అందాము. మిగిలిన విద్యలతో పోల్చిచూస్తే దీని వద్ద అపార సంపద ఉంది. దీని సాయంతోనే మానవుడు తన దారిద్ర్య సంకెళ్లను తెంపుకోవడమే కాక వాతావరణ కాలుష్యాన్ని కూడా దూరం చేయగలడు.

ప్ర : ఇది అభూత కల్పన అనిపిస్తోంది. ఇప్పటి వరకూ దీని గురించి వినలేదు. ఐరోపా, అమెరికా దేశాల్లో కూడా దీని ప్రస్తావన ఇప్పటి వరకూ రాలేదే?

జ : మనం ఎప్పుడూ పాశ్చాత్య దేశాలవైపే చూస్తుండడం వల్ల సహజంగా అలానే అనిపిస్తుంది. కానీ మనం తూర్పు దేశాలను చూస్తే ప్రతి సారీ తనదైన బలంతో ప్రజలకు మేలు చేసే అనేక మార్పులకు శ్రీకారం జరగడం కనిపిస్తుంది.ప్రతిసారీ ఈ బలం వేర్వేరు రూపాల్లో కనిపిస్తుంది. ఇప్పుడు లోకవిద్య రూపంలో ఈ బలం ఉంది.

ప్ర : ఇదేదో మిస్టరీలా ఉంది. నాలో ఆసక్తతను పెంచుతోంది. మీరు నాకు లోకవిద్య గురించి, దానిలో బలం ఎక్కడుందో, ఎలా వుందో తెలియజేస్తారా?

జ : లేదు. ఈ విషయం అంత తొందరగా స్పష్టం కాదు. మనం నెమ్మదిగా అన్ని విషయాలూ చర్చించుకుంటూ పోతేనే ఇది సులభమవుతుంది.

ప్ర : సరే. మీకు నచ్చిన విధంగా మీరు చెప్పుకుంటూ పోండి. నాకు ఎక్కడ

సందేహం వుంటే అక్కడ మిమ్మల్ని ఆపి, అడిగి తెలుసుకుంటాను.

జ : సరే ప్రయత్నిస్తాను. లోకవిద్య అంటే సమాజంలో వున్న జ్ఞానంగా చెప్పుకోవచ్చు. ఇది ఒక మతానికి, కులానికి, సంప్రదాయానికి లేక విశ్వవిద్యాలయానికిగానీ, పుస్తకాలకుగానీ పరిమితిమైనదికాదు. ఇది మానవ జీవనంలోనే ఇమిడి ఉంటుంది. అక్కడే పుట్టి నిత్యనూతనంగా వెలుగొందుతూ ఉంటుంది. ఇది అందరికీ చెందినది. మనిషితో, మానవ సమాజంతో పాటు పుట్టి మానవ జన్మ వున్నంత వరకూ దానికి ఆసరాగా వుంటుంది.

ప్ర : ఏమీ అర్థం కాలేదు. కొంచెం వివరిస్తారా?

జ : ఒక విధంగా దీన్ని పాఠశాల, కాలేజీ, విశ్వవిద్యాలయాల పరిధిలో లేని విద్యగా అర్థం చేసుకోవచ్చును. అంటే సమాజంలో ఎక్కువ మంది దేని ఆధారంగా బతుకుతున్నారో దానినే లోకవిద్య అనవచ్చును. ఉదాహరణకు రైతు కూరగాయలు, ధాన్యం పండించడం ఏ స్కూల్లోగానీ, కాలేజీలోగానీ నేర్చుకోడు. ఇది అతనికి కుటుంబ సభ్యులు లేక ఇతర పెద్దమనుషుల నుంచి సంక్రమిస్తుంది. తన అవసరాలకు తగ్గట్టుగా దాన్లో మార్పులు చేయడం, కొత్త విషయాలు తెలుసుకోవడం అతనికి స్వతహాగా వస్తుంది. అదేవిధంగా చేతివృత్తుల వారిని చూడండి. చెక్క, మట్టి, లోహం, ఇత్తడి, ప్లాస్టిక్, కాగితం, కాటన్, మిశ్రమ లోహాలతో మానవ జీవనానికి అవసరమైన వస్తువులను తయారు చేసే వారందరి దగ్గరా లోకవిద్య వుంది. ఈ విధంగా ఆదివాసీలు, స్త్రీలలో కూడా లోకవిద్య సంపద వుంది. వీరందరి వద్ద అపరిమితమైన జ్ఞానం, వివేకం వున్నాయి. అదే లోకవిద్యలోని బలాన్నీ శక్తినీ సూచిస్తుంది.

ప్ర : సరే చదువుకోని వాళ్ళందరూ అజ్ఞానులే అనడం తప్పని ఒప్పుకుంటాను. అంటే వాళ్ల వద్ద స్కూలులో నేర్పే చదువు కాకుండా వేరే రకమైన విద్య ఉందని చెప్పాలి. కానీ వాళ్లదగ్గర వున్న పాతకాలపు నైపుణ్యంతో తమ బతుకుల్నీ, సమాజాన్నీ బాగు చేయగలరా?

జ : సమాజంలోని బీదవర్గాలను విస్మరించి, సమాజ పురోభివృద్ధి, వికాసం, ప్రగతిలాంటి మాటలు మాట్లాడలేము. రైతులు, చేతివృత్తిదారులు, ఆదివాసీలు, చిన్న దుకాణదారుల సుఖసంతోషాలు, భాగస్వామ్యం చురుకుదనం, నియంత్రణలను పెంపొందించే విధంగా సమాజాన్ని నిర్మించడం, వారి లోకవిద్యలతోనే సాధ్యమవుతుంది. విద్య ఒకరి వద్ద, బలం వేరొకరి వద్ద వుండడం కుదరదు. విద్యావంతుడే బలవంతుడు! స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాశ్చాత్య విద్య నాగరికతలే మనకు సిరిసంపదలనిపిస్తాయని కలలుగంటూ వచ్చాము. కానీ వారు నేర్పిన విద్య వారికే ఉపయోగపడింది. అసలు ఆధునిక విద్య, వెనుకబడ్డ చదువులంటే ఏమిటీ? సమాజంలో అత్యధికులకు మేలు చేసేది, గౌరవప్రదమైన ఉద్యోగాలను సృష్టించేది, ప్రకృతితో లయబద్ధంగా నివసించడానికి దారి చూపేది, పెట్టుబడి, అహంకార ఒత్తిడులను తట్టుకోగలిగేది మాత్రమే ఆధునిక విద్యగా నేను గుర్తిస్తాను. ఇక ఉత్పత్తిని పెంచుతూ, దానికి కారకులైన వారిని దారిద్ర్యంలోకి నెట్టివేసేదీ, మనిషి సుఖాల కోసం ప్రకృతి వనరులన్నింటినీ దోచుకోవడానికి ఉపయోగపడేదీ, ప్రతిరంగంలో ఉన్న వారికి లేని వారికి మధ్య అంతరాలు సృష్టించి వృద్ధి చేసేదే నా ఉద్దేశ్యంలో వెనుకబడిన విద్య.

ప్ర : అంటే మీరు లోకవిద్యను ఆధునిక విద్యగా గుర్తిస్తారు?

జ : నిస్సందేహంగా! అయితే ఇందులో మహిమలు, మంత్రాలు లేవు. మొత్తం మానవ సమాజం గౌరవ ప్రదంగా జీవించడానికోసం ఉద్యమించడానికి కారణమవుతుంది. గనక దీనిని పురోగమన విద్య అనవచ్చు. నిరంకుశత్వం, దోపిడీ వ్యవస్థ, అధికారం దీన్ని నాశనం చేయడానికి ప్రయత్నించినా, దీనికి మరణం లేదు. ఇది మనిషిని ఎప్పుడూ వదిలిపోదు.

ప్ర : అదెలా సాధ్యం?

జ : మన దేశాన్నే చూడండి. ఆంగ్లేయులు లోకవిద్యను అంతం చేయడానికి

చెయ్యని ప్రయత్నం లేదు. రైతులను దోపిడీ చేయడం, చేతివృత్తుల అభివృద్ధిని అడ్డుకోవడం, ఆదివాసీలను అడవులకే పరిమితం చేయడం వంటి చర్యలను అడ్డుకోగల్గింది వీరి వద్దనున్న లోకవిద్య సంపద మాత్రమే. దీని సహాయంతోనే వీరు కేవలం బతికుండటమే గాక సమాజానికి అవసరమైన కూడు, గుడ్డలను అందించగలిగారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా వీరికి సముచిత గౌరవం లభించలేదనే చెప్పాలి. విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న వారు లోకవిద్యను తిరస్కరించారు. ప్రభుత్వాలు కూడా వీరి ఉద్యమాలకు మద్దతివ్వాల్సిందిపోయి అణచివేయడం, పెట్టుబడిదారుల పరిశ్రమలకు రకరకాల ప్రోత్సాహక చర్యలు చేపట్టడం జరిగింది. అయితే దీని వల్ల లోకవిద్య అంతమనలేదు. ఇప్పటికీ దీని సహాయంతో వచ్చిన ఉత్పత్తులు సర్వీసులు ఆధునిక విద్యతో వచ్చిన వాటికి ఏమాత్రం తీసిపోవు. ఇది లోకవిద్యకున్న బలంగాక మరేమిటి?

ప్ర : నిజమే! ఆంగ్లేయులు ఎక్కువగా దీన్ని నిర్మూలించడానికే ప్రయత్నించినా దాని బలం వల్ల అది తట్టుకోగల్గింది. కానీ అసలు అది దోపిడీకి ఎందుకు గురవుతోంది. దాన్నించి ఎలా బయట పడగలుగుతుంది?

జ : అసలు ప్రశ్న ఇదే! జవాబు అంత సులభంగా లభించదు. ముందు లోకవిద్య గురించి చాలా తెలుసుకోవాలి. రాత్రి బాగా పొద్దుపోయింది. ఈ విషయం ఇంతటితో ఆపేద్దాం!

ప్ర : మీతో మాట్లాడ్డం వల్ల చాలా విషయాలు అర్థమవుతున్నాయి. ఈ విషయాలన్నీ ఇప్పటివరకూ ఎలా విస్మరించానో ! మీతో ఈ సంభాషణ కొనసాగించాలనుకుంటున్నాను. రేపు ఇంటికి పోవాల్సిన పనివుంది. కానీ రెండు రోజుల తర్వాత ఇక్కడే మాట్లాడుకుందాం? సరేనా!

జ : తప్పకుండా!

## లోకవిద్య అంటే ఏమిటి ?

బీచుపల్లిలో రెండు రోజుల తర్వాత కృష్ణానదీ తీరాన గ్రామస్తులందరూ కలుసుకున్నారు. గతంలో కన్నా సంఖ్య పెరగకపోయినా హైదరాబాద్ నుంచి ఇద్దరు ముగ్గురు వ్యక్తులు చేరడం జరిగింది. ఇంకా గ్రామస్తులు నిరుత్సాహంగానే వున్నా స్థానిక అధికారులకు ఒక వినతిపత్రం ఇవ్వాలని అందరూ అంగీకరించారు. వినతిపత్రాన్ని తయారు చేసిన తర్వాత ప్రశ్నలు-జవాబులు కార్యక్రమం కొనసాగించారు.

ప్ర : రెండు రోజుల క్రితం మీతో చర్చించిన విషయాల గురించి ఆలోచిస్తూ మా మిత్రులతో కూడా మాట్లాడాను. స్వాతంత్ర్యం తర్వాత మన ప్రభుత్వాలు ప్రజల్లో నిరక్షరాస్యతను దూరం చేయడానికి తమవంతు కృషి చేశామని ఒప్పుకోవాలి. కానీ 60 ఏళ్ల తర్వాత కూడా 40 శాతం ప్రజలకు కూడా విద్యనందించలేకపోవడం చూస్తే ఈ విధానం అమలు పరచే పద్ధతిలో కాకుండా అసలు విధానంలోనే లోపం ఉన్నట్లు తెలుస్తోంది. లోకవిద్యను కలిగిన వారికి కూడా చదువుకున్న వారి హోదా ఇచ్చి మిగతా ప్రజలను విద్యావంతులుగా చేయడానికి ఉపయోగిస్తే దాదాపు 100 శాతం ప్రజలు విద్యాధికులుగా ఉండేవారు. దీని వల్ల సమాజంలో ఆత్మవిశ్వాసం పెరిగేది. ఇది తలుచుకుంటేనే ఉత్సాహం ఉరకలేస్తోంది.

జ : అవును! మీరు సరిగ్గా చెప్పారు. ప్రజలు చాలా వెనుకబడి వున్నారని ప్రచారం చేస్తూ వారిని బీదరికంలో వుంచడం వల్లనే నాయకులు తమ అధికారాన్ని నిలుపుకుంటూ దోపిడీని కొనసాగించారు. అయితే అవసరమైనప్పుడు కొద్దిగా ధన సహాయం లేక మాట సాయం చేస్తూ వాళ్ల మద్దతు సంపాదిస్తున్నారన్నది తెలిసిన విషయమే.

ప్ర : అసలు ఈ లోకవిద్య గురించి లోతుగా అర్థం చేసుకోవాలని దాని బలమేమిటో తెలుసుకోవాలని మా గ్రామస్తులందరూ తయారుగా వున్నారు. కానీ దీని గురించి చాలా సందేహాలు వున్నాయి. ఈ రోజు వాటిని మీ ముందు చర్చించవచ్చునా?

జ : తప్పకుండా! మీరు నిర్మోహమాటంగా మీ ప్రశ్నలనడగండి. అన్నింటికీ నా దగ్గర సమాధానం లేకపోయినా వాటిని చర్చించడం మంచిదే!

ప్ర : మనదేశంలో చాలా ఎక్కువ మంది ప్రజలు ఈ లోకవిద్యకు సంబంధించిన కుటుంబాలకు చెందిన వారే. వీరందరూ వివిధ కులాలు, వృత్తులు, ప్రాంతాల వారీగా విడిపోయి వున్నారు. లోకవిద్యకు గౌరవాన్ని ఆపాదించే ప్రయత్నంలో ఈ విభేదాలు పెరిగే ప్రమాదం ఉందా? ధనికులు పేదవారి మధ్య తేదాలు ఇంకా పెరిగే ప్రమాదం ఉందా?

జ : ఈ విషయం స్పష్టంగా తెలుసుకోవడం ఎంతో అవసరం. లోకవిద్య ఒక మతం, కులం, సంప్రదాయం వంటి వాటికి అతీతమని ముందే చెప్పాను. ఒక విధంగా చూస్తే లోకవిద్యకు ప్రాంతీయ స్వభావం వుందని చెప్పవచ్చును. భాష ఏ విధంగా మతం, కులం సంప్రదాయపు సంకెళ్లకు లోబడకుండా ప్రాంతీయంగా వుంటుందో లోకవిద్య కూడా అలాగే వుంటుంది. లోకవిద్యను మనం కేవలం వృత్తిగా పరిగణించినట్లయితే అది మతం, కులం వంటి విభజనలలో చిక్కుకున్నట్లు కనిపిస్తుంది. కాని దీనిని వృత్తిలాగా కాకుండా విజ్ఞానంలాగా చూడాలి. ఒకరైతు, గిరిజనుడు ఒక చేతివృత్తిదారుడు పనిచేసే విధానాన్ని గమనించినట్లయితే అందులో తర్కం, విలువలు కనిపిస్తాయి. లోకవిద్యను ఒక సిద్ధాంతంగా (ఆలోచనా విధానంగా) చెప్పుకోవచ్చు.

ప్ర : ఇంకా కాస్త వివరించి చెపితే సులభంగా అర్థమవుతుందేమో!

జ : ఒకే ప్రాంతానికి చెందిన విభిన్న కులాల వారు, మతాలవారు తమ తమ ఆచార వ్యవహారాలన్నింటికీ ఒకే భాషను ఉపయోగిస్తారు. అదే విధంగా లోకవిద్య కూడా కుల, మత భేదాలను గుర్తించకుండా తన తర్కం, విలువలతో ఒక ప్రాంతానికి చెందిన వారందరి సుఖసంతోషాలకు కారణమవుతుంది. అంటే కులాల ప్రకారం, మతాల ప్రకారం వృత్తి విద్యను చేస్తుండే వారందరి మధ్య ఐక్యతకు లోకవిద్యలో జ్ఞానం, తర్కమే కారణం.

ప్ర : అయితే లోకవిద్య ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమా?

జ : అలా అనలేం. కాలాన్ని బట్టి ప్రాంతాన్ని బట్టి లోకవిద్య విభిన్న రూపాల్లో కనిపిస్తుంది. కానీ వాటిలో అంతర్గతంగా వున్న జ్ఞానం, తర్కం మాత్రమే ఒకే రకంగా వుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో లోకవిద్యకు, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్లోని లోకవిద్యకు రూపంలో తేడా వుండవచ్చునుగానీ వీటన్నింటికీ ఒకటే జ్ఞానం. ఆధారమని చెప్పుకోవాలి. అదే విధంగా రష్యాలోగానీ, ఆఫ్రికాలోగానీ లోకవిద్య వేరే రూపంలో కనిపించవచ్చు. వేర్వేరు ప్రాంతాలకు చెందిన లోకవిద్యలన్నింటికీ ఒకటే ఆధారం.

ప్ర: అదెలా సాధ్యమైంది?

జ: ఒక ప్రాంతానికి చెందిన లోకవిద్యను పాటించే వారి మధ్య ఐక్యత ఏ విధంగా వుంటుందో వివిధ ప్రాంతాలకు చెందిన లోకవిద్య పాటించే వారిలో కూడా అదే విధంగా ఏకీభావం వుంటుంది.

ప్ర: అది ఏవిధమైన సంబంధాలను బలపరుస్తుంది?

జ: అది స్నేహపూరితమైన సంబంధం. ఒకరి అభివృద్ధికి మరొకరు సహకరించేలా సర్వజనసమ్మతంగా ఒక విద్యకు మరొక విద్యకు సంబంధాలుంటాయి. లోకవిద్య నిరంతరంగా ఈ నిర్మించడం పునర్నిర్మించడం చేస్తూ వుంటుంది.

ప్ర: ఈ నైపుణ్యం, తర్కం, విలువలు గురించి ఇంకొంచెం వివరిస్తారా?

జ: వాటి గురించి వివరించడానికి ప్రయత్నిస్తాను. కానీ కాస్త శ్రద్ధగా వినాల్సివుంటుంది.

ప్ర: అలాగే.

జ: మొదట తర్కాన్ని తీసుకుందాం! లోకవిద్యలో వున్న తర్కానికి కాలేజీల్లో నేర్పించే తర్క శాస్త్రానికి పోలికే లేదని చెప్పాలి. పాశ్చాత్య దేశాల చదువుల్లో తర్కం

న్యాయమైనదా కాదా అన్న విషయం వారి పరస్పర సంబంధాల మీద ఆధారపడి వుంటుంది. దానికి జ్ఞానంతోగానీ, సమాజంతోగానీ వాస్తవాలతోగానీ సంబంధం ఉండదు. ఆ దేశాల్లో ఒక వస్తువు గుర్తింపు, అది ఏ పదార్థల నుండి తయారయింది. ఎలా తయారయింది.అన్న విషయంపై ఆధరాపడి వుంటుంది. కానీ లోకవిద్య అందుకు భిన్నంగా వుంటుంది. దానికి గల తార్కిక గుణాలేమిటి? లోకవిద్య ఎప్పుడూ సమాజ అవసరాలు, విలువలు,ఉద్దేశ్యాలతో ముడిపడి వుంటుంది. ఒక విధంగా పెప్పాలంటే అందరికీ ఆమోదయోగ్యమైనదే లోకవిద్య తర్కమని చెప్పుకోవచ్చు. ఈ విద్యను అమలు చేసే వారి కార్యక్రమాల్లో దీనిని గమనించవచ్చు. ఒక రైతును తను దున్నే భూమి గురించి అడిగతే నేల, దానిలో ఎటువంటి వంటలు పండించవచ్చునో, ఎటువంటి ఎరువులు వేయవచ్చునో ఎటువంటివి వేయకూడదో,వాతావరణంపై ప్రాణికోటిపై, మనుష్యులపై స్వల్పకాలిక దీర్ఘకాలిక ప్రభావం ఎలా వుంటుందో అలాంటి విషయాలన్నింటి గురించి తెలియజేస్తాడు. అలాగే వాతావరణం, పనిముట్లు,మార్కెట్టు ఇంకా భూమిలో జరిగే మార్పులకు సరిపడేలా తన పని విధానం, పంటలు,వ్యవసాయం చేసే విధానాల్లో కూడా మార్పులు చేసుకుంటాడు. అంతేకాకుండా తను చేసే ప్రతి పనివల్ల ప్రకృతి లోనూ తోటి మనుషుల్లోనూ ఎటువంటి ప్రభావం కల్గిస్తోందని ఆలోచిస్తూ వారితో సంబంధాలు చెడిపోకుండా వుండేలా తన లోకవిద్యలో మార్పులు చేసుకోగలదు. ఒక గిరిజనుడిని అడవి గురించి,నదుల, గుట్టల గురించి అడిగినా ఇటువంటి అనుభవమే కలుగుతుంది. చేతివృత్తుల వారు కూడా ఇలాగే ఆలోచిస్తారు. ఇంకొక విధంగా చెప్పాలంటే లోకవిద్యలో దృష్టిలో ఒక వస్తువును గురించి అర్థం చేసుకోవాలంటే దానికి మిగతా వస్తువులు, ప్రజలు,వాతారణం, ప్రపంచంతో గల సంబంధాలపై ఆధారపడి వుంటుంది. అయితే ఇది నిర్జీవమైన సంబంధం కాకుండా సామాజిక విలువలు,లోకళ్యాణం వంటి విషయాలతో మమేకమై వుంటుంది. ఇది సమాజంలో అన్ని కులాల, మతాలు, సంప్రదాయాలతో నిమిత్తం లేకుండా అన్నింటితో సమానంగా కలిసిపోతుంది.

ప్ర:ఇది నిజంగా మహత్తరమైన కొత్త విషయం! స్కూల్లో ఒక విద్యార్థిని గాలి

గురించి అడిగినా లేక నీటి ప్రవాహం గురించి అడిగినా ముందు అవి దేనితో తయారవుతాయో (ఆక్సిజన్,నైట్రోజన్, హైడ్రోజన్) చెప్పి వాటి వల్ల గాలికి, నీటికి ఎటువంటి గుణాలుంటాయో చెప్తాడు. అంటే ఒక వస్తువు అంతర్గత స్వరూపానికి ప్రాముఖ్యతనిచ్చి దాని వల్ల ఎటువంటి గుణాలుంటాయో చర్చిస్తాడు. దీనికి పూర్తి వ్యతిరేకంగా లోక విద్యలో

దానికీ మిగిలిన వాటికీ మధ్య సంబంధాలకు ప్రాముఖ్యత వుంటుంది. ఒక వస్తువు లోక కళ్యాణానికి ఎంత ఉపయోగపడుతుందో తెలుసుకుంటే దాని గురించి అంత తెలుస్తుందన్నది లోకవిద్యకు మూలం. మీరు దీన్ని ఆధునిక విద్య అని ఎందుకన్నారో కొద్దికొద్దిగా అర్థమవుతోంది. అలాగే దీని విలువలు, నైపుణ్యం గురించి వివరిస్తారా?

జ: మీరు త్వరితంగా అర్థం చేసుకుంటున్నారు. అయితే లోకవిద్యలో నైపుణ్యం,తర్కం, విలువలను విడివిడిగా చూడకూడదు. ఇది ఒకదానితో ఒకటి ఎంతగా కలిసిపోయాయంటే వాటిని విడదీసిచూడడం వల్ల లోకవిద్య మూల స్వభావమే నష్టపోతుంది. నైపుణ్యాన్ని పక్కకు పెట్టి చేతివృత్తుల వారు సామర్థ్యం ప్రమాణాలనూ పెంచుకోవాలని కొందరు సలహాలిస్తుంటారు. కొన్ని చోట్ల అలాగే జరిగినప్పటికీ చాలా మంది చేతివృత్తుల వారు తమ సలహాలను పాటించలేదని వీరు ఫిర్యాదు చేస్తుంటారు. నైపుణ్యాన్ని మరిచిపోలేక పోవడం వెనుక గల కారణాలను వారు అర్థం చేసుకుంటానికి ప్రయత్నించరు. నైపుణ్యానికీ, మామూలు శ్రమకు మధ్య తేడాను వీరు గుర్తించడంలో విఫలమయ్యామని తెలుసుకోలేరు.

ప్ర: అంటే లోకవిద్యానుసారం శారీరక శ్రమ, మానసిక శ్రమల మధ్యతేడాలు లేనట్లేనా?

జ: ఖచ్చితంగా లేవు. ఆ తేడాలను పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించింది. లోకవిద్యలో ప్రతిపనీ తెలివితో చేసేదే! పెట్టుబడిదారీ వ్యవస్థలో పెద్దఎత్తున వస్తువుల తయారీలో కేవలం శారీరక శ్రమనందించే వారిని కార్మికులని పిలవసాగారు. మనమంతా ఆ వ్యవస్థలో పుట్టి పెరగడం వల్ల లోకవిద్య అమలు చేసే వారిని కూడా కార్మికులుగా చూస్తున్నాం.

ప్ర:ఇప్పటి దాకా చదువురని వాడు,మొరటువాడు, పల్లెటూరి వాడు అని పిలవబడే వాళ్లలో లోకవిద్య ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. వీళ్లంతా చేసే పనిలో ఎంతో జ్ఞానం వుందన్న విషయం తెలిస్తే మొత్తం సమాజంలో ఒక కొత్త చైతన్యం వస్తుంది. ఇకముందు ఇటువంటి అవమానాలను సహించే పరిస్థితి తప్పకుండా మారుతుంది.

జ: లోకవిద్యను గురించి పుస్తకాలు గానీ శాస్త్రాలు గానీ లేవుగనుక వాటి గురించి వినడం వల్ల లేక చదవడం వల్ల ఆ విద్యలో పండితులంటూ ఎవరూ లేరు. ఒక సామాన్య మానవుడి బతుకు బాటే లోకవిద్యకు ఆధారం. మన జీవితం ఎంత చలాకిదో లోకవిద్య కూడా అంతే.

ప్ర: రైతులు. గిరిజనులు,చేతివృత్తుల వారి పనులు వారి వివేకాన్ని తెలియజేస్తాయని మా చదువులు చెప్పలేదు. అసలు ఇంతటి విజ్ఞాన భాండారం మా చదువుల్లో లేదంటే ఎంతో బాధగా వుంది.

జ: నిజమే! స్కూళ్ళలో,కాలేజీల్లో చెప్పే చదువుల వల్ల మనం సమాజాన్ని పురాతన గ్రంథాలు,శాస్త్రాల ప్రకారం చూస్తున్నాం. ఇవన్నీ మన సంప్రదాయంలో ఒక చిన్న భాగం మాత్రమే. పాత నమ్మకాలు నిర్జీవమైన సంబంధాలు మన సంప్రదాయానికి గుదిబండలుగా మారాయి. లోకవిద్య దృష్టిలో సంప్రదాయానికి ఆధారం సమాజంలోని వివేకవంతమైన లోకకళ్యాణానికి పనికి వచ్చే కార్యక్రమాలు ఇవన్నీ సజీవమైన సంబంధాలు. బూజు పట్టిన ఆలోచనా విధానాన్ని వదిలేసి కొత్త అవసరాలకు తగ్గట్టుగా మార్పులు చేయడం లోకవిద్య లక్షణం.

ప్ర: లోకవిద్యను ఇంకా పాతకాలపు విద్యగా మొండివాదంగా చూస్తున్నందుకు సిగ్గు పడుతున్నాను. అయితే నాకింకా సందేహాలున్నాయి. మిమ్మల్ని మళ్ళీ ఎప్పుడు కలవమంటారు?

జ: ఇప్పటి దాకా మాట్లాడుకున్నదంతా ఒక సారి తిరిగి ఆలోచిస్తే బాగుంటుంది.

ఈ లోకవిద్యను అమలు పరిచే వారితో కలిసి విస్తారంగా చర్చించి సందేహాల నివృత్తి చేసుకోగలిగితే ఇంకా బాగుంటుంది. నాకు కొన్ని వ్యక్తిగత సమస్యలుండటం వల్ల ఈ వారం కలుసుకోలేము. కానీ వచ్చే శుక్రవారం రైల్వే స్టేషను దగ్గరుండే చిన్న దుకాణ దారులంతా కలుస్తున్నారు వాళ్లందరినీ ఆ స్థలాలు ఖాళీ చేయమనడం వల్ల వారి పొట్టకొట్టినట్లయింది. వాళ్లను కలిసి వారేం చెయ్యాలనుకుంటున్నారో అడుగుతాను. వీలైతే మీరు కూడా అక్కడికి రండి .

ప్ర: తప్పకుండా ! వీలైతే ఒకరిద్దరు స్నేహితులను కూడా తీసుకువస్తాను.

జ: స్వాగతం...

## లోకవిద్యాకరణ

శుక్రవారం సాయంత్ర సమయం ఊళ్లో స్టేషను దగ్గర జనంతో గొడవతో సందడిగా ఉంది. ఆటోలు, బస్సులు, లారీలు, సైకిళ్లు, స్కూటర్లతో దుమ్ములేస్తోంది. జనం ఇళ్లకు వెళ్లే తొందరలో ఉన్నారు. ఈ హడావుడిలోనే రోడ్డుమీద ఫుట్‌పాత్ పక్కన మూసిన దుకాణం ముందు ఒక బల్లమీద కొంత మంది కూర్చుని ఉన్నారు. వారితోనే మన ప్రశ్నకర్త, అతని ఇద్దరు మిత్రులు ఇంకా కార్యకర్త కూడా వున్నారు. ఒకరి వెనుక ఒకరు రావడంతో దాదపు 70–80 మంది పోగయ్యారు. స్టేషనును అందంగా చేయడం రోడ్డు విస్తరణ చాలా మంది దుకాణదారుల కడుపు మీద కొట్టింది. రాజకీయ పార్టీలన్నీ మౌనంగా వుండిపోయాయి. అధికారులెవరూ కూడా పట్టించుకోవడం లేదు. చాలా మంది ఆవేశంగా ప్రసంగాలు చేశారు. చివరికి పోరాటమే మార్గమని నిర్ణయించి ఒక ప్రతినిధి మండలిని ఎన్నుకొని, ఒక వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించాలనుకున్నారు. మీటింగు అయిపోయిన తర్వాత ప్రశ్నోత్తరాలు మొదలయ్యాయి.

ప్ర : వీరి పరిస్థితి క్లిష్టంగా వుంది. ఎక్కడికి పోతారు? సమస్యనుండి ఎలా బయటపడతారు?

జ : ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించడంలో వీరు చాలా నష్టపోతున్నారు.

ప్ర : కానీ ఇది చాలా అన్యాయం. సరే మొన్నటి చర్చను ముందుకు సాగిద్దామా?

జ : అలాగే.

ప్ర : అన్ని రకాల సంప్రదాయాలు విలువలు పద్ధతులను చీల్చుకుంటూ ముందుకుపోయే గుణమున్న లోకవిద్యను చూస్తే నాకు ఆశ్చర్యం కలుగుతోంది. సరిగ్గా ప్రకృతి తన కార్యక్రమాలను జరిపే విధంగా!

జ : అవును. అదే విశేషం!

ప్ర : లోకవిద్య ఒక నిర్జీవమైన సంప్రదాయాన్ని మన మీద రుద్దదనీ, పనికిరాని అంశాలను వదిలేస్తూ, మంచి అంశాలను తనలో కలుపుకుపోతుందనీ స్పష్టమవుతోంది. మరి కొత్త ప్రాంతాల నుండీ లేక ఇతర సమాజాల నుండీ ఎదురయ్యే జ్ఞానాన్ని ఎలా స్వీకరిస్తుంది?

జ : బయటనుండి వచ్చే జ్ఞానాన్ని లోకవిద్య ఎప్పుడూ ఆహ్వానిస్తుంది. తన తర్కం, విలువలతో సరిపోయే అంశాలను కలుపుకుంటూ మిగిలిన వాటిని తిరస్కరించే ఉదార స్వభావం లోకవిద్యలో వుంది.

ప్ర : సైన్సు పట్ల కూడా ఇదే వైఖరి ఉంటుందా?

జ : అవును.

ప్ర : కానీ సైన్సు లోక విద్యను ఒక శాస్త్రంగా చూడకుండా చిన్నచూపు చూస్తుందని మీరే అన్నారు. ఒక రకంగా చూస్తే ఆర్థికంగా, మేధోపరంగా లోకవిద్యాధరులను సైన్సు దారిద్ర్యంలోకి తోసిందని చెప్పుకోవచ్చు. అయినా కూడా సైన్సు లోకవిద్యల మధ్య స్నేహం వుంటుందా?

జ : అవును. లోకవిద్య అన్ని రకాల మేధోసంపత్తులతో స్నేహంగా వుంటుంది.

ఏ ఒక్క దానితోనూ శతృత్వం వుంచుకోదు.

ప్ర : ఇది నిజమనిపించడం లేదు. మనకు ఇది ఎలా కనిపిస్తుంది?

జ : మన దైనందిన జీవితంలో దీన్ని చూడగలము. ఏదైనా విశ్వ విద్యాలయం నుంచి చదువుకున్న వారు రైతుల వద్దకుగానీ, చేతి వృత్తుల వారి వద్దకుగానీ వెళ్లి వారి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఎలా పెంచుకోవాలో చెప్తున్న పుడు శ్రద్దగా వింటారు తప్ప వారిని వెక్కిరించరు. తమకు ఉపయోగపడే అంశాలను స్వీకరిస్తారు. నిరుపయోగమైన అంశాలున్నప్పటికీ వినివూరుకుంటారు తప్ప అవమాన పరచరు. కానీ సైన్సు మటుకు లోకవిద్యాధరులందరినీ మూఢనమ్మకాలున్న వారిగా తెలివి హీనులుగా వెనుకబడిన వారిగా ముద్రవేస్తుంది. వారిని అవహేళనకు అవమానానికి గురిచేస్తుంది.

ప్ర : అవును. నాకుకూడా అలానే అనిపించింది. అయితే విభిన్నమైన సమాజాలు లేక సభ్యతల జ్ఞానాన్ని లోకవిద్య ఏ పద్ధతుల్లో స్వీకరిస్తుంది?

జ : పాత, కొత్త తేడాలు లేకుండా అన్నిటి నుంచీ లోకవిద్య జ్ఞానాన్ని స్వీకరిస్తూ దానిని లోకవిద్యాకరణకు గురిచేస్తుంది. దీనిని ఒక నిరంతర ప్రక్రియగా చెప్పుకోవచ్చు. ఇది ఏ కొద్దిమందో కాకుండా లెక్కలేనంత మంది ప్రజలు ధనాపేక్ష లేకుండా ఎటువంటి ప్రచారం లేకుండా చేసే సామాజిక ప్రక్రియ. సమాజం కోసం ఉపయోగపడే జ్ఞానాన్నికున్న ప్రత్యేక లక్షణం ఇదే!

ప్ర : లోకవిద్యాకరణ అంటే ఏమిటీ?

జ : లోకవిద్యాకరణ అంటే లోకవిద్యలో కలుపుకుపోవడం. రకరకాల ప్రవాహాలన్నీ గంగానదిలో కలిసిపోయి గంగానదిగా మారినట్లే లోకవిద్యలో ఇమిడిపోయిన విద్యలన్నీ లోకవిద్యగా మారుతాయి. విభిన్నమైన జ్ఞాన ప్రవాహాలన్నీ లోకవిద్యకు గల తర్కం, విలువలు మొదలైన వాటిలో కలిసి పోవడమే లోకవిద్యాకరణగా చెప్పుకోవచ్చు. అయితే ఈ ప్రక్రియలో లెక్కలేనంత మంది పాలుపంచుకోవడం

వల్ల ఈ విద్యపై అధికారం ఏ కొద్దిమంది వద్ద మాత్రమే వుండదు. ఇది ప్రజలందరి విద్య అవుతుంది. లోకసమ్మతమైన విద్య అవుతుంది. ఈ లోకవిద్యాకరణను ఒక విధంగా చెప్పాలంటే మానవుడి శరీరంలో జరిగే జీర్ణ ప్రక్రియతో పోల్చి చూడవచ్చును. మనం ఏదైనా నోట్లో నమిలినంత మాత్రాన అవి మన శరీరానికి కావాల్సిన శక్తిగా మారిపోవు. మన జీర్ణాశయంలో లెక్కలేనన్ని భాగాలు శరీరంలోని మిగిలిన భాగాల సహకారంతో తమతమ విధులను నిర్వహించిన తర్వాతే మనం తిన్న పదార్థాలన్నీ తమ గుణాలను విసర్జించి పోషకశక్తిని, శరీరానికి బలానీ సమకూరుస్తాయి. అలాగే సమాజంలోని ప్రజలందరి సారధ్యంలో జ్ఞాన నిర్మాణం కొత్తదనం చేర్చడాన్నే లోకవిద్యాకరణగా గుర్తించాలి.

ప్ర : అయితే సైన్సుగానీ, ఆధునిక పరిజ్ఞానం గానీ లోకవిద్యలో ఇమడటం కష్టమనిపిస్తోంది. ఇంత ఉపయోగాలనందించిన సైన్సును వదులుకోవాలన్నా కష్టమే గదా!

జ : నిజంగా అది కష్టమైన విషయమే! అయితే దీనికి కారణం లోకవిద్యలో లోపం కాదు. సమాజానికి లోకవిద్య పట్ల గల అపనమ్మకం. అసలు ప్రశ్న సైన్సు ఇచ్చిన దాన్ని ఎలా రక్షించుకోవాలన్నది కాదు. దాని వల్ల జరిగిన అనర్థం (దారిద్ర్యం) నుంచి ఎలా విముక్తి పొందాలన్నది! సైన్సు నుండి పొందిన దాన్ని ఎలా లోకవిద్యాకరణ చేయాలన్నది!

ప్ర : అవును. నిజమే! కానీ విముక్తి పొందడానికి లోకవిద్యే మార్గమని ఎలా నమ్మాలి? మళ్లీ పాత ప్రశ్ననే అడుగుతున్నాను. లోకవిద్యలో శక్తి ఏరూపంలో, ఏ ప్రకారం మీకు కనిపిస్తోందో వివరించకపోతే మొత్తం విషయం అర్థం కావడం కష్టం!

జ : అవును. ఇప్పుడు అసలు విషయానికి వచ్చాము. యింకొక విధంగా చూస్తే లోకవిద్యకున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక బలాన్ని ఎలా గుర్తించాలన్నదే మీ ప్రశ్న. లోకవిద్య లోకశక్తిగా సామాన్య జీవితంలో మారాలంటే

ఏం చెయ్యాలి?

ప్ర : అవును ఈ ప్రశ్నలన్నీ నన్ను తినేస్తున్నాయి?

జ : ఈ ప్రశ్నలకు సమాధానాల్లోనే లోకవిద్య ఏ విధంగా అణచివేయబడుతోంది, దానికి విముక్తి ఎలా లభిస్తుందన్న విషయాలకు సమాధానాలు దొరుకుతాయి.

ప్ర : మళ్లీ ఎప్పుడు కలుద్దాం?

జ : మీరే చెప్పండి.

ప్ర : మా ఊళ్లో మరికొంత మంది ఈ విషయాలన్నీ చర్చించాలనుకుంటున్నారు. మీరు మా ఊరు రాగలిగితే మా అదృష్టంగా భావిస్తాం.

జ : నాకూ సంతోషమే! ఆదివారం సాయంత్రం రావచ్చునా?

ప్ర : సరే. మాకు తప్పకుండా వీలవుతుంది.

## లోకవిద్యలోని సామాజిక శక్తి

వర్గల్ గ్రామంలో ఊరిమధ్యలో ఒక రచ్చబండ పక్కనున్న వేపచెట్టు చల్లని నీడలో 7–8 యువకులు గుమికూడారు. వీరందరూ మన ప్రశ్నకర్త మిత్రులే! ఇందులో ఒకరు హైదరాబాద్‌లో ఇంకొకరు వరంగల్‌లో చదువుకుంటున్నారు. సెలవులకు వాళ్ల గ్రామానికి వచ్చారు. మూడో వ్యక్తికి ఊళ్లో చిన్న కిరాణా దుకాణం వుండగా ఇంకో ఇద్దరు చీరలు నేసే పని చేస్తుంటారు. మిగిలిన ఇద్దరూ ఊళ్లో కూరగాయల వ్యవసాయం చేస్తుంటారు. పొద్దున్న పదిగంటల నుంచీ వీరందరూ మన కార్యకర్తతో ట్రాక్టరులో ఊరంతా తిరిగి మధ్యాహ్నానికి రచ్చబండ దగ్గర విశ్రాంతి కోసం ఆగారు.

ఊళ్లోని వ్యవసాయం, చేతివృత్తుల వారి స్థితిగతుల గురించి చర్చించిన

తర్వాత కార్యకర్త చొరవ తీసుకుని సంభాషణ ప్రారంభించాడు.

ప్ర : ఇవాళ మనం లోకవిద్యకు గల శక్తి గురించి మాట్లాడుకుందాం! మనం ఈ శక్తిని ఎలా గుర్తించగలం?

జ : ప్రజాశక్తికి ఆధారమైన రూపంలో లోకవిద్యకు గల శక్తిని చూడాలి. అంటే లోకవిద్యలోని సామాజిక శక్తిని చూడాలి. అన్యాయాన్ని ఎదిరిస్తూ సమాజంలో ఎక్కువగా న్యాయమే జరిగేలా శంఖం పూరించగల శక్తి దీనికే వుంది. ఆర్థిక, సామాజిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లో లోకవిద్యకు గల శక్తిని గుర్తించి దానిని సార్వజనికంగా మార్చాలి. మనం ఒక్కొక్క రంగాన్ని తీసుకుందాం!

ప్ర : సరే! ముందు రాజకీయ రంగాన్ని తీసుకుందామా?

జ : లేదు మనం ముందు సామాజిక రంగంతో మొదలు పెడదాం! గత 20 సంవత్సరాలలో మన సమాజం చాలా మారిందన్న విషయాన్ని గుర్తించడం ఎంతో ముఖ్యం. సమాజంలో మార్పులు నిరంతరం జరుగుతూనే వుంటాయి. ఈ స్వభావాన్ని మనం గుర్తించగలగడం ఎంతో అవసరం. సమాజంలోని గొప్ప-పేదల తేడాలు భిన్నాభిప్రాయాలు, అందరికీ ఒకే న్యాయం వంటి విలువలను గుర్తుంచుకోవాలి. ఇది సరిగ్గా జరిగినపుడు మన సామాజిక కార్యక్రమాలు, బాధ్యతలను తేలికగా గుర్తించగలము.

ప్ర : అవును. ఇది నిజమే!

జ : గత 20 సంవత్సరాలుగా మన సమాజంలో విజ్ఞానరంగంలో చాలాపెద్ద ఎత్తున మార్పులు జరిగాయి. వీటివల్ల సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఒక కొత్త దారి దొరికిదని చెప్పవచ్చు. ఇప్పటిదాకా మనం సమాజంలోని తేడాలను ధనం, కులం, మతం లేక ప్రాంతాల ఆధారంగా చూశాము. ఆ దృష్టితోనే సమస్యలకు పరిష్కారం కోసం వెతుకుతూ వచ్చాము. అవునా!

ప్ర : నిజమే! మన రాజకీయం కూడా వీటిపైనే జరిగింది. అందువల్లే నేడు కొన్ని

ప్రాంతీయ, దళిత, వెనుకబడిన కులాల, వామపక్షాల నాయకత్వంలో గల పార్టీ అధికారంలో వున్నాయి.

జ : అవును. ఒక విధంగా చూస్తే ఇది మంచిదే అనిపిస్తుంది. అయితే వీటివల్ల మేల్కొన్న చైతన్యానికి గల హద్దులు కూడా స్పష్టంగా కనపడసాగాయి. ఈ సందర్భాలలో కొన్ని సముదాయాలకే పరిమితమైన చైతన్యం మొత్తం సమాజాన్ని మార్చలేదు. అంటే సామాజిక స్థాయికి ఆ చైతన్యం చేరుకోలేకపోతే, వాటి ఆధారంతో అధికారంలోకి వచ్చిన పార్టీలు తిరిగి పెట్టుబడిదారీ శక్తుల సేవకే పనికివస్తాయి. ఇప్పుడు మనకి అదే కదా కనిపిస్తోంది?

ప్ర : అవును. అదే జరుగుతోంది.

జ : ఆ చైతన్యాలన్నింటినీ సామాజిక స్థాయికి తీసుకెళ్లవలసిన అవసరం ఎంతైనా వుంది. ప్రతి వ్యక్తికీ సామాజిక న్యాయం, గౌరవం కల్పించే ఆలోచనా విధాన నిర్మాణం ఎంతో అవసరం. ఇంకొక విధంగా చెప్పాలంటే సామాజిక ఆలోచనా విధానంలో కొత్తదనం నిర్మాణ, పునర్నిర్మాణాల సమయం వచ్చింది.

ప్ర : నిజమే! సామాజిక ఆలోచనా విధానం మెల్లగా కుళ్లిపోవడం మొదలైందనే చెప్పాలి. కానీ ఇందాక చెప్పుకున్న తేడాలను ప్రస్తావించాల్సిన అవసరమే లేదా? వాటి పేరుతో సమాజంలో జరిగే అన్యాయాలు వికృత రూపంలో ఇంకా వున్నాయి కదా?

జ : కులం, మతం, ధనం మొదలైన తేడాలను విస్మరిస్తూ కొత్త ఆలోచనా విధాన నిర్మాణం జరగాలని నేనటం లేదు. ఈ తేడాలను నిర్మూలించడమే మన లక్ష్యం. కానీ మన సమాజంలో జరుగుతున్న కొన్ని కొత్త సంఘటనలు ఈ అసమానతల సంబంధాలలో కొత్త కోణాల్ని చేర్చాయి. సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి వీటిలో చాలా వున్నాయి. పాతకాలపు ఆలోచనా విధానంలో వీటిని ఎదుర్కొనే శక్తి లేదు. అందువల్ల కొత్తగా వచ్చిన అసమానతలతో పాటు పాతవాటిని కూడా ఎదుర్కోగల

శక్తివున్న ఆలోచనా విధాన నిర్మాణానికి పూనుకోవాలి.

ప్ర : మీరు మాట్లాడే కొత్త సంఘటనల గురించి చెప్తారా?

జ : కొద్ది సంవత్సరాలుగా కంప్యూటర్–ఇంటర్‌నెట్ మరియు మొబైల్ ఫోనుల ద్వారా ఒక కొత్తయుగం ప్రారంభమైందని చెప్పుకోవచ్చు. దీన్ని సమాచారయుగం అని పిలుస్తుంటారు. 20వ శతాబ్దాన్ని పారిశ్రామిక యుగంగా గుర్తిస్తే 21వ శతాబ్దాన్ని సమాచార యుగంగా భావించవచ్చు. ఏ సమాజంలో కంప్యూటర్ ఇంటర్‌నెట్, మొబైల్‌ల వాడకం ఎక్కువగా వుంటుందో దానిని అంత ఆధునిక, ప్రగతిశీల, విజ్ఞానవంత సమాజంగా ప్రచారం చేస్తున్నారు.

ప్ర : అవును. ఆ విషయాల్ని టీవీల్లో, వార్తా పత్రికల్లో చూస్తూనే వున్నాము. కానీ మన సమాజంలో వాటిని మహత్తరమైన సంఘటనలుగా ఎలా చూస్తున్నారు?

జ : ఈ సమాచార యుగం విజ్ఞానరంగంలో సృష్టించిన అలజడిలో లోకవిద్య ఒక ఆలోచనా విధానానికి జన్మనిచ్చే అవకాశం కనిపిస్తోంది.

ప్ర : అది ఎలా ?

జ : సమాచారయుగంలో విజ్ఞాన నిర్వహణ ( నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ )అనే కొత్త సైన్సు మొదలైంది. దీనికి ఆధారమే కంప్యూటర్, ఇంటర్‌నెట్ మరియు మొబైలు పరిజ్ఞానం. దీనిని చదవాలంటే బాగానే ఖర్చు అవుతుంది. కానీ వచ్చే ఉద్యోగాల్లో జీతాలు బాగానే ముడతాయి.

ప్ర : అవును. ఇప్పుడు ప్రతి విద్యార్థీ దీన్నే చదవాలనుకుంటూ, బేసిక్ సైన్సులను నిర్లక్ష్యం చేస్తున్నారు.

జ : విజ్ఞానరంగంలో ఇప్పుడు సైన్సుకు సర్వోన్నత స్థానం లేదనే చెప్పాలి. 20వ శతాబ్దం మొత్తం సైన్సుదే రాజ్యంగా నడిచింది. మన దేశాల్లాంటి వాటిలో లోకవిద్యను తొక్కేసినా, అవమాన పరచినా సైన్సుకే పెద్దపీట వేశారు. కానీ ఇప్పుడు

దాన్ని తలదన్నే విజ్ఞాన నిర్వహణ రావడంతో శాస్త్రరంగంలో పెద్ద చిన్నాల గుర్తింపులో ఒక అలజడి మొదలైంది.

ప్ర : దీని వల్ల లోకవిద్యకు ఎలా ప్రయోజనం కలుగుతుంది?

జ : సైన్సు మొదటినుంచీ లోకవిద్యను ఒక పరిజ్ఞానంగా గుర్తించకుండా దానిని అణచివేయడానికే ప్రయత్నించింది. కానీ ఈ కొత్త విజ్ఞాన నిర్వహణ అనే శాస్త్రం దృష్టిలో ప్రతి సమాచారానికీ ప్రాముఖ్యత వుంటుంది. లోకవిద్యను అణచివెయ్యాలన్న దృష్టి దీనికి లేదు. దాన్ని కూడా పరిజ్ఞానంగానే భావిస్తుంది.

ప్ర : ఇది లోకవిద్యకు అనుకూలమైన విషయమే!

జ : అవును. కానీ దీనికోసం లోకవిద్య నుండీ భారీ మూల్యాన్ని ఆశిస్తుంది.

ప్ర : ఎలా?

జ : దాని గురించి తర్వాత చెప్తాను. ఇప్పుడు మనం అర్థం చేసుకోవలసిన విషయం ఒకటి వుంది. ఈ సమాచార యుగంలో విజ్ఞాన నిర్వహణ సైన్సు మరియు లోకవిద్యల మధ్యగల సంబంధాలు ఒక కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. దీని వల్ల పరస్పర సంబంధాలు అధికారాల పట్ల మార్పులు జరుగుతున్నాయి. అందువల్ల లోకవిద్యననుసరించే వారందరూ ఒక్కటై విజ్ఞాన రంగంలోనూ, సమాజంలోనూ ఒక గౌరవప్రదమైన స్థానం కోసం పోరాడగలిగే శక్తి పొంది, సామాజిక న్యాయం ధ్యేయంగా సమాజాన్ని పునర్నిర్మించే అవకాశాలకు పునాది వేయగలుగుతారు.

ప్ర : ఒక అంతులేని ఉత్సాహాన్నిచ్చే దృశ్యాన్ని మాకు చూపించారు. దీన్నింకా స్పష్టంగా చూడాలని మనసు ఉవ్విళ్లూరుతోంది.

జ : సైన్సు ఆధిపత్యం విజ్ఞాన రంగంలో తగ్గడంతో పాశ్చాత్య (ఐరోపా) విలువల పట్ల ఆగ్రహం కూడా సమాజంలో తగ్గుముఖం పట్టింది. దీనికి తోడు చాలా మంది లోకవిద్యపై ఆశాభావం పెంచుకోసాగారు. సమాజంలో న్యాయవరంగా రావలసిన గౌరవం కోసం ఇప్పుడు లోకవిద్యాధికులందరూ వాదించే సమయం ఆసన్నమైంది. ఇప్పుడు ఆరోగ్యం, సంగీతం, సాహిత్యం, లలిత కళలు, తిండిగింజలు, వస్త్ర పరిశ్రమ, గృహోపకరణాల తయారీ వంటి రంగాల్లో లోకవిద్య అవసరం ఎంతో ఉంది. ఇందులో భాగంగా కొందరు లోకవిద్యాధికులను (కొన్ని పెద్ద కంపెనీలు) ప్రలోభానికి గురిచేసి తమవైపునకు తప్పుకొని కొని కోట్ల వ్యాపారాన్ని నడిపిస్తున్నాయి. వ్యక్తిగత స్వార్థ ప్రలోభానికి లొంగకుండా మొత్తం సమాజాపేక్షతో ఆలోచిస్తే లోకవిద్యాధికులందరూ సమాజ వికాసానికి తోడ్పడగలరు.

ప్ర : అవును. అది సంభవమే. లోకవిద్య గౌరవ ప్రతిష్టల కోసం ఎన్నో ప్రదర్శనలవుతున్నా సమాజాభివృద్ధికి అవసరమైన దారులు కనిపించడం లేదు నిర్వాహకులు మాత్రం లాభాలు పొందుతున్నారు.

జ : ఇక్కడ డబ్బులు కాదు ముఖ్యం. మన గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ మన శక్తిని దుర్వినియోగం చేయడం. విశ్వవిద్యాలయాలనూ, పెద్దపెద్ద పరిశ్రమనూ స్థాపించడం ద్వారా సైన్సు లోకవిద్యకు చాలా నష్టం కలిగించింది. సమాచార యుగం కూడా లోకవిద్యను తన గుప్పిట్లో వుంచుకొని పెద్ద కంపెనీలకు కోట్ల రూపాయల వ్యాపారాన్ని కల్పిస్తోంది. వినోద రంగంలో సంగీతం, నృత్యాలు, భాష పాటల్లో జానపద రూపాలను ప్రవేశపెట్టడం, తిండిగింజలు సుగంధక ద్రవ్యాల్లో జానపద పద్ధతులు, బట్టల తయారీ డిజైన్‌లలో వీటి పాత్రను చూడవచ్చును. అంటే సమాచార యుగం కూడా లోకవిద్య దోపిడీపైనే నిలబడుతోంది.

ప్ర : అయితే సమాచార యుగంలో లోకవిద్యాధరుల శ్రమతో పాటు వారి విజ్ఞానం కూడా దోపిడీకి గురి అవుతోందా?

జ : అవును. లోకవిద్యననుసరించే వారి స్థానభ్రంశం దీనికి సాక్ష్యం. లోకవిద్యను

గుప్పిట్లో బంధించడానికి పెద్దఎత్తున వీరిని తరిమివేయడం జరుగుతోందనిపిస్తోంది.

ప్ర : అంటే తమ విజ్ఞాన సంపద దోపిడీకి వ్యతిరేకంగా లోకవిద్యాధరులు తమ మార్గాన్ని ఎంచుకోవాలన్న మాట! ఈ సమాచారయుగపు సామాజిక ఆలోచనా సరళి యించులోనే దాగి వుండవచ్చును.

జ : అలాగే కనిపిస్తోంది. వ్యవసాయ భూముల్ని ఆక్రమించడం చేతివృత్తుల పతనం, చిన్న చిన్న వ్యాపారస్తులను వారున్న స్థలాలు ఖాళీచేసి వెళ్లిపోమనడం, గిరిజనుల ప్రదేశాలను ఆక్రమించడం వంటి సంఘటనలు వారికి అనువైన విధంగా వారి పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ జీవించే అధికారాన్ని లాక్కుంటాయి.

ప్ర : సరే ! లోకవిద్య పోరాటంతో తన విముక్తిని సంపాదించుకుంటుందని అనుకుందాం! కానీ దీని వల్ల సమాజంలోని కుల, మత, ప్రాంతీయ భేదాలు కూడా అంతమవుతాయని ఎలా అనుకుంటాం?

జ : లోకవిద్యలో కుల, మత, ప్రాంతీయ తారతమ్యాలు లేవని తెలుసును గదా! ఇందులో విభిన్న అంశాల కలయిక వుంది. సమాచార యుగం వీరందరి విజ్ఞాన సంపదను దోపిడీకి గురిచేస్తోంది గనుక లోకవిద్యననుసరించే వారందరూ ఐకమత్యంతో పోరాడగలరు. సమాజంలో తేడాలు పోవడానికి ఈ ఐకమత్యం ఎంతో అవసరం.

ప్ర : అలా జరిగే అవకాశాలున్నాయి. కానీ ఈ ఆలోచనా సరళి గట్టిపడాలంటే దీనికి బహుళ ప్రాచుర్యం లభించాలి.

జ : నిజమే! ఇప్పుడు ఒక కొత్త ఆలోచనా సరళిని ఇవ్వడానికి లోకవిద్యలో బలం ఎక్కుడుందో, ఎందుకుందో మాత్రమే చర్చిస్తున్నాము. అంతేకాదు! లోకవిద్య సమాజంలోని విభిన్న వర్గాల మధ్యగల సంబంధాల రూపురేఖల్ని చూస్తూ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. యూరోపియన్ విద్యావిధానాల ఫలితంగా మనం ఇప్పటిదాకా వివిధ వర్గాల మధ్య గల పోరాటాల దృష్ట్యా

మాత్రమే సమాజాన్ని అర్థం చేసుకోవాలనుకున్నాము. మానవ సంబంధాల ఆధారంగా ఈ ప్రపంచాన్ని ఒక కొత్త దృష్టితో చూడలేమా? లోకవిద్యానుసారం ప్రకృతితోపాటు మానవుడి అభివృద్ధి ముడిపడి వుంటుంది. మనిషికి మనిషికి మధ్య, మనిషికి ప్రకృతికి మధ్య సత్సంబంధాలు పెంచే ఆలోచన లోకవిద్యలో వుంది. ఇంతటి అధునాతనమైన విజ్ఞాన సంపదలో ఈ సందర్భంగా ఒక కొత్త ఆలోచనా సరళి జన్మను మనం చూడలేమా?.

ప్ర : మీరన్నది నిజమేననిపిస్తోంది. కానీ దీని గురించి ఎక్కువ చర్చ ఎందుకు జరగడం లేదు?

జ : దీనికి గల కారణం లోకవిద్యలో వున్న బలం సుషుప్తావస్థలో వుండటమే! బయటవారి ఆక్రమణలకు గురైన తర్వాత అవమాన భారంతో దోపిడీకి గురవుతూ లోకవిద్య కొన్ని కుటుంబాలకు, కులాలకు, గ్రామాలకు, అడవులకే పరిమితమైంది. లోకవిద్య ఎన్నటికీ ఆ చక్రబంధాల్లోనే వుంటుందన్న భ్రమ బలపడిపోయింది. కానీ అది సరికాదు. లోకవిద్య ఈ బంధాలను తెంచుకొని సార్వజనీకం, సామాజికం అయినప్పుడు తన విశ్వరూపాన్ని చూపిస్తుంది.

ప్ర : చంకలో బిడ్డను పెట్టుకొని ఊరంతా వెతికినట్లుగా వుంది.

జ : నిజమే! పరిస్థితి అలాగే వుంది.

ప్ర : ఈ రోజు చర్చతో మా ఆలోచనా విధానానికి ఒక కొత్త మలుపునిచ్చారు. లోకవిద్యయే సరియైన మార్గమన్న అభిప్రాయం ఇంకా బలపడుతోంది. మాటల్లో పడి చీకటి పడిందన్న విషయాన్నే గుర్తించలేదు. రండి ఏమైనా తిందాం!

జ : ఈ ఊరు రావడం నాకెంతో ఆనందంగా వుంది. వచ్చే గురువారం గుడి దగ్గరలో రజకులు, కల్లుగీత కార్మికులతో వారి సమస్యల గురించి చర్చించడానికి వస్తున్నాను. మీరు కూడా వస్తే మన చర్చను కొనసాగించవచ్చును.

ప్ర : మేము తప్పకుండా వస్తాం.

# లోకవిద్యలోని ఆర్థిక శక్తి

హైదరాబాద్ కోఠి ప్రాంతం బళ్లమీద సామాన్లు అమ్ముకునే వారితో సాయంత్రం సందడిగా వుంది. పళ్లు, కూరగాయలు, పూలు అమ్ముకునే వారి వ్యాపారంతో రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం వీరిని అక్కడినుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ సమస్యల గురించి చర్చించడానికి అక్కడ ఒక మీటింగు జరుగుతోంది. అక్కడ మన కార్యకర్త మరియు కొంతమంది ప్రశ్నకర్తలు వున్నారు. ఈ చిన్న వ్యాపారుల సమస్యల పట్ల రాజకీయ పార్టీల వైఖరి ప్రభుత్వాధికారుల స్పందన వంటి విషయాలపై చాలాసేపు చర్చ జరిగింది. తర్వాత లోకవిద్యకు గల బలాబలాలవైపు దృష్టి మళ్లింది.

ప్ర : ఇవాళ మనం లోకవిద్యకున్న ఆర్థిక శక్తి గురించి మాట్లాడుకుంటే బాగుంటుంది!!

జ : సరే! మానవుడు తన శక్తి సామర్థ్యాలతో ఎల్లప్పుడూ తన అవసరాలకు మించి ఉత్పత్తి సాధిస్తూ వచ్చాడు. ప్రకృతిలోని ప్రతి జడపదార్థం లేక జీవమున్న ప్రాణి తను తీసుకున్న దానికన్నా ఎక్కువ మోతాదులో ప్రకృతికి తిరిగి ఇవ్వడం మామూలే కదా! మానవుడి సామాజిక ధర్మం కూడా దీన్లోనే దాగి వుందని చెప్పవచ్చు. సమాజంలోని మిగులు ఉత్పత్తిని ఎలా ఉపయోగించాలి. దానికి వాడవలసిన పద్ధతులు మొదలైనవన్నీ మానవ సమాజంలో జీవ భాగమే! కాబట్టి సమాజంలోని ఆర్థిక వ్యవస్థలను అర్థం చేసుకోవడానికి కేవలం ఆర్థిక శాస్త్ర నిపుణులు, విద్యావేత్తలే కావాలనడం సరికాదు. కేవలం వారి మేథోసంపదతోనే ఈ ఆర్థిక ప్రపంచం నడుస్తోందనడం కూడా తప్పే!

ప్ర : ఈ మధ్యకాలంలో టీవీలో పేపర్లలో వాణిజ్య ఆర్థిక రంగాల గురించిన వార్తలు ఎందరికి అర్థమవుతున్నాయి? చాలా మంది ఆ ఛానెళ్లు చూడరు వార్తల్ని చదవరు. కానీ దానికి సంబంధించిన వార్తలు మన జీవితాల్ని ప్రభావితం చేస్తాయి కదా!!

జ : ప్రభావితం చేస్తాయి కానీ వారు చెప్పిందే వేదం అనుకోవడం సరికాదు. వారు చర్చించే విషయంలో లోకవిద్యాధరులెదుర్కొంటున్న సమస్యల ప్రస్తావనే వుండదు. జనాభాలో ఎనభై శాతం కన్నా ఎక్కువ ప్రజల ఆర్థిక ప్రయోజనాలను విస్మరించే ఆర్థిక వాణిజ్య ప్రపంచం వల్ల ఏమిటి లాభం?

ప్ర : మాకూ అదే అనిపిస్తోంది. వారు వేరే ప్రపంచంలో వున్నారేమో?

జ : గమనించాల్సిన విషయం ఏమిటంటే ఎనభై శాతం ప్రజలు విభిన్న రంగాల్లో ఉత్పత్తి కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ వారి జీవితాల్లో అన్నిటికీ కొరత వుండడం! అంటే కృత్రిమంగా వారిపై దారిద్ర్యం రుద్దడమే! పారిశ్రామిక యుగంలోని మార్కెట్లు, జీవనశైలి, ఉత్పాదక పద్ధతులు మానవ సమాజంలోనే కాక ప్రకృతిలో కూడా దారిద్ర్యాన్ని నింపాయని చెప్పవచ్చు. సమాచార యుగంలో ఈ బీదరికం ఇంకా పెరుగుతోంది.

ప్ర : మరి లోకవిద్యలో వేరే రకమైన ఆర్థిక వ్యవస్థ వుంటుందా?

జ : అవును. ఈ దారిద్ర్యాన్ని రూపుమాపే ప్రణాళిక లోకవిద్యలో వుంది.

ప్ర : అది ఎలా సాధ్యం?

జ : లోకవిద్యలో మానవతా సంబంధాలు, మానవతా దృక్పథం వున్నాయి. మనం తీసుకున్నదాని కన్నా ఎక్కువ తిరిగి ఇవ్వాలన్నదే లోకవిద్యలోని ఆర్థిక ప్రణాళిక సారాంశం. మానవుల పరస్పర సంబంధాలు ప్రకృతి- మానవుల మధ్య సంబంధాలకు ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది. వాటిని బలపరుస్తూ పరస్పర అభివృద్ధి, శక్తి పెంచడమే దాని లక్ష్యం.

ప్ర : కొద్దిగా వివరంగా చెప్పండి?

జ : ఒక రైతు తను దున్నే భూమిలో పండించే శక్తి తగ్గకుండా చూస్తూ దాన్ని ఎలా పెంచాలనే ఆలోచన చేస్తూ ఉంటాడు. పంటలు మార్చడం, వ్యవసాయానికి

పనికి వచ్చే జంతువులను పెంచడం మొదలైన పనుల వల్ల దానిని సాధిస్తాడు. ఒక గిరిజనుడు కూడా అడవి నుంచీ తనకు దొరికిన దాని కన్నా ఎక్కువ ఎలా తిరిగివ్వాలనే ఆలోచిస్తుంటాడు. అలాగే మత్స్యకారులు, కంసాలులు, కుమ్మరులు, చేతివృత్తికళాకారుల సేవల్లో కూడా ఈ ఆలోచనే కనిపిస్తుంది. ఇందులో వ్యక్తిగత, తాత్కాలిక ప్రయోజనాలకు, దురాశకు చోటుండదు. పాప, పుణ్యాల ప్రస్తావన కూడా ఈ సందర్భంగా అర్థం చేసుకోవాలి. కొన్ని వేల సంవత్సరాల నుండీ మానవజాతి ఇటువంటి విధానాలను అమలు చేస్తూ వచ్చింది. పెట్టుబడిదారీ విధానం రాకతో ఇదంతా తారుమారు అయింది. మానవుడిని తన సహజ ప్రవృత్తి నుండీ దూరం చేయడమే ఆ విధానం లక్ష్యం. మన దారిద్ర్యానికి మూలం కూడా అందులోనే వుంది.

ప్ర : లోకవిద్యానుసారం ఆర్థిక వ్యవస్థకు ఆధారం ఏది?

జ : లోకవిద్యలో ఆర్థిక వ్యవస్థకు విజ్ఞానం ఆధారం కానీ పెట్టుబడిదారీ విధానంలో పెట్టుబడే ఆధారం. పారిశ్రామిక యుగంలో సైన్సుద్వారా పెద్దయంత్రాల సహాయంతో అతితక్కువ సమయంలో అత్యధిక ఉత్పత్తిని సాధిస్తూ పెట్టుబడుల కేంద్రీకరణ జరిగింది. చివరకు వివేకం, ప్రభుత్వాధికారాలు కూడా ఈ కేంద్రీకరణకు లొంగి పోవాల్సి వచ్చింది. దీని వల్ల సమాజంలో సమతూకం దెబ్బతింది. దేశీయ, అంతర్జాతీయ, రాజకీయాలు, చిన్న , పెద్ద యుద్ధాలు దీని కారణంగానే జరుగుతున్నాయి.

ప్ర : అది ఎలా?

జ : అన్యాయంగా లాభాలు లేకుండా పెట్టుబడుల కేంద్రీకరణ అసాధ్యం. దీని కోసం నైతిక ధార్మిక, వైధానిక, భౌతిక నియమాలను పక్కన పెట్టాల్సి వుంటుంది. స్వల్ప కాలిక లాభం, దురాశ, సంకుచిత స్వార్థాలకే ప్రోత్సాహం లభించింది. సైన్సు కూడా మానవుని సామాజిక స్వభావం నుండీ దూరం చేయడానికే తోడ్పడింది. పారిశ్రామిక యుగాన్ని యూరోపియన్ల దురాశ చరిత్రగానే

చెప్పుకోవాలి. దీనికి విరుద్ధమైన సమాజాలు ప్రదేశాలు ప్రపంచంలో ఎన్నో వున్నా వాటి గురించిన ప్రస్తావన ఎక్కడా చరిత్రలో లభించదు. అంటే మన చదువుల్లో ఈ దురాశ, ప్రలోభాలను మాత్రమే మన పిల్లలకు నేర్పుతున్నామని చెప్పుకోవచ్చు.

ప్ర : అవును. పెరిగి పెద్దయిన తర్వాత బాగా డబ్బులు సంపాదించమనే మనకు నేర్పిస్తారు.

జ : ఇవాళ డాక్టరు, ఇంజనీరు లేక బిజినెస్ మ్యాన్ అవడానికి ప్రయత్నాలకు కారణం అధిక ధనసంపాదనే. ఏ రంగంలో అత్యధిక లాభాలు సాధ్యమో దానినే అత్యుత్తమ రంగంగా గుర్తిస్తున్నారు. ఈ కారణంగానే విద్య, ఆరోగ్య రంగాలు కూడా వ్యాపార రంగాలుగా మారిపోయాయి. ఒకసారి ప్రవేశించిన తర్వాత జేబులు ఖాళీ, అనారోగ్యం తప్పవు. వాటిలో మానవతా విలువలు శూన్యమవుతున్నాయి.

ప్ర : లోకవిద్యలో ఆర్థిక వ్యవస్థకు ఆధారం విజ్ఞానమని అన్నారు. దీని అర్థం వివరిస్తారా?

జ : లోకవిద్యానుసారం ఉత్పత్తి పంపిణీలు రెండూ విజ్ఞాన పూరితమైనవే! వస్తువుల తయారీ మరియు వాటి ఉపయోగ కార్యక్రమాలు మనుషుల మధ్య మరియు ప్రకృతితో సంబంధాలను బలపరిచే విధంగా వుంటాయి.

ప్ర : వాటిని ఎలా చూడగలము?

జ : లోకవిద్యలో వ్యర్థం, నిరుపయోగం అన్నవే వుండవు. ఉత్పత్తి వినియోగ కార్యక్రమాల తర్వాత మిగిలినవన్నీ మానవునికిగానీ ప్రకృతికిగానీ పునరుపయోగానికి పనికి వస్తాయి. ఇది చాలా గొప్ప విషయం. సైన్సు సూత్రాల ప్రకారం ఒక యంత్రం దాని పని పూర్తి చేసిన వెంటనే వేస్టు (నిరుపయోగ పదార్థం)ని కూడా ప్రసాదిస్తుంది. ఈ చెత్త తిరిగి ఎందుకూ పనికిరాదు. పారిశ్రామికయుగం పెద్ద ఎత్తున వేస్టు పదార్థాలకు జన్మనిచ్చి ప్రకృతిని పాడు చేసింది. కేవలం లాభాల మీద దృష్టి పెట్టిన కొన్ని సమాజాలు ఆ సమస్యను

పట్టించుకోకుండా వదిలేసాయి. కానీ లోకవిద్యకున్న బలం ఏమిటంటే ప్రకృతి నుంచి తీసుకున్న దానికన్నా ఎక్కువ తిరిగి ఇవ్వడం!

ప్ర : అవును దీనిని ఉన్నత విద్యగా గుర్తించవచ్చును. కానీ లోకవిద్యలో పంపిణీ వ్యవస్థ ఎలా వుంటుంది.?

జ : దీని ప్రకారం ఉత్పత్తి, వినియోగాల మధ్య ఎక్కువ దూరం వుండదు. అయితే దీనర్థం వస్తువులు దూర ప్రాంతాలకు ఎగుమతి చేయకూడదని కాదు. కానీ తొంభై శాతం ఉత్పాదన స్థానిక వినియోగానికి వాడి మిగిలిన పది శాతం దాటకుండా ఎగుమతికి వాడుకోవాలి.

ప్ర : ఇది ఒక బలమైన వ్యవస్థ ఎలా అవుతుంది.?

జ : ఎక్కువ శాతం స్థానికంగా వాడటం వల్ల పెట్టుబడుల కేంద్రీకరణ జరగదు. స్థానిక సమాజాభివృద్ధికి మేలు జరుగుతుంది. అక్కడే వినియోగం వల్ల లోకవిద్య మరింత మెరుగయ్యే అవకాశం వుంటుంది. దీనితో సమాజం మొత్తం ముందుకు పోగలుగుతుంది. దీని ఫలితంగా ప్రతి వ్యక్తికీ ఇందులో భాగస్వామ్యం వుంటుంది. ఇది విజ్ఞానం వల్ల వస్తుంది. పెట్టుబడులతో కాదు.

ప్ర : కానీ ఇప్పుడు గ్లోబలైజేషన్ హవా నడుస్తోంది. ఎక్కువ లాభాల కోసం ఎంత దూరమైనా పంపించగల అవకాశాలున్నాయి. మరి లోకవిద్య దీన్ని తట్టుకోగలదా?

జ : అమానుష విజ్ఞానాన్ని, వ్యవస్థలనూ ఎదుర్కోవటానికి లోకవిద్యకు ఇది ఒక చారిత్రాత్మక అవకాశంగా నేను భావిస్తున్నాను. పారిశ్రామిక యుగంలో ఫ్యాక్టరీల్లో యంత్రాల ద్వారా ఉత్పత్తులు పెట్టుబడి కేంద్రీకరణకు దోహదం చేసాయి. సమాచారయుగంలో ఈ పెట్టుబడి డబ్బు రూపంలో ముందుకు వచ్చింది. ఇక కేవలం ఉత్పత్తిని పంచడమే పెట్టుబడి కేంద్రీకరణకు సరిపోలేదు. తను పెట్టుబడులను పెంచుకోవడానికి మార్కెట్లలో అమ్మకం దారి చూపించింది. క్రమంగా ఫ్యాక్టరీల కన్నా మార్కెట్లు ముఖ్యమయ్యాయి. ఉత్పత్తి ఏ రకంగా జరిగినా

దాని వినిమయం బజార్లోనే జరగాలి. మార్కెట్లో ప్రతి అమ్మకంలోనూ పెట్టుబడిదారులకు వాటా అన్న వ్యవస్థ జన్మించింది. దీనినే గ్లోబలైజేషన్ లేక ప్రపంచీకరణ అంటారు. పారిశ్రామిక యుగంలో వలస దేశాల వ్యవస్థకు యంత్రాల మాధ్యమం ఎలా ఉపయోగపడిందో సమాచార యుగంలో సమాచార మాధ్యమం గ్లోబలైజేషన్‌కు అదే విధంగా సహాయపడుతోంది.

ప్ర : ఇవన్నీ చాలా వేగంగా జరుగుతున్నాయి. గత 20 సంవత్సరాలుగా ఇంత జరుగుతున్నా దాన్ని యిప్పుడు సులభంగా అర్థం చేసుకోగలిగాము. లోకవిద్యకు ఇప్పుడు లభించిన చారిత్రాత్మక అవకాశాన్ని గురించి వివరించండి.

జ : ఇప్పుడు ఉత్పత్తి అనేది ఏ టెక్నాలజీతో, ఏ ఫ్యాక్టరీలో, ఏ ప్రయోగశాలలో, ఏ గిరిజనుడు చేసాడో, ఏ చేతివృత్తిల వారు చేసారో అన్నది గ్లోబలైజేషన్‌లో ముఖ్యంకాదు. తయారైన సరుకు ఏ విధంగా ఉత్పత్తి అయినా, అది మార్కెట్లలోకి రావడం ముఖ్యం. అందువల్ల ఇప్పుడు ప్రతి సేవనీ, ప్రతి మనోభావాన్ని వస్తురూపంలో ప్రదర్శించి దానిని అమ్మకానికి సరిపోయేలా చేసే పనులకే ప్రోత్సాహం లభిస్తోంది. గ్లోబలైజేషన్ వ్యవస్థలన్నింటికీ మార్కెట్లలోనే పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి జరిగే పద్ధ కాదు. ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ల పునస్సమీకరణలు ఇందుకే మొదలయ్యాయి. అందువల్ల చిన్నచిన్న వ్యాపారులను తరిమేస్తూ మార్కెట్లు మొత్తం పెద్దపెద్ద కంపెనీల ఆధీనంలోకి వస్తున్నాయి.

ప్ర : దీని ఫలితాలెలా వున్నాయి?

జ : దీని వల్ల రెండు మార్పులు జరుగుతాయి. ఉత్పత్తి సైన్సు ద్వారా నా లేక లోకవిద్య ద్వారానా అన్నది ముఖ్యం కాకుండా, మార్కెట్లో రెండింటికీ సమాన ప్రాధాన్యత లభిస్తుంది. కోల్పోయిన గౌరవ ప్రతిష్ఠలను తిరిగి సంపాదించుకోవడానికి, లోకవిద్యకు ఇది ఒక సదవకాశం. రెండో విషయం లోకవిద్యాధరులందరి మధ్య ఐక్యతకు అవకాశాలు మెరుగవుతాయి. ఎప్పుడైతే కార్మికులు, కర్షకులు, గిరిజనులు, చేతివృత్తుల వారు, చిన్న వ్యాపారస్తులు కలిసి

విజ్ఞాన వంతమైన సమాజ నిర్మాణానికి పూనుకుంటారో, అప్పుడే అమానుష వ్యవస్థల అంతానికి నాంది పడుతుంది.

ప్ర : అవును లోకవిద్యలో ఆ అవకాశాలు కనిపిస్తున్నాయి. కానీ మీరు ప్రచార మాధ్యమాన్ని విమర్శించడానికి కారణం?

జ : గత కొన్ని సంవత్సరాలుగా ప్రచార మాధ్యమాలన్నీ గ్లోబలైజేషన్‌కే ఉపయోగపడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సమాజాన్నుంచీ జానపదకళలు, సంగీతం, ఆరోగ్యం, కథలు, జీవన విధానాల సమాచారాన్ని క్రోడీకరించి, కంప్యూటర్లలో భద్రపరుస్తూ ప్రచార మాధ్యమమే ఒక పెద్ద పరిశ్రమగా మారింది. వీటి గురించి సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకొనే కార్యక్రమాల్లో లోకవిద్యాధరుల కన్నా, వీటిని సంకలనం చేసిన కొద్దిమంది వ్యక్తులకే లాభాలు చెందసాగాయి. లోకవిద్యాధరుల పరిజ్ఞానాన్ని దోచుకునే కొత్త విధానం వచ్చింది. వారికి తెలిసింది వారు వాడుకోలేని పరిస్థితి వచ్చింది.

ప్ర : అంటే లోకవిద్యను ఒక పరిశ్రమగా మార్చే కుటిల యత్నమన్నమాట! పరిజ్ఞానాన్ని దోపిడీ చెయ్యడమంటే ఏమిటో ఇప్పుడు అర్థమవుతోంది.

జ : లోకవిద్యలోని విలువలన్నిటినీ లాభాపేక్ష అంశాలుగా మార్చడం ప్రకృతిపట్ల మనుషుల పట్ల చేస్తున్న క్షమించరాని నేరం. అందువల్ల ఈ మాధ్యమం గురించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్ర : లోకవిద్యకు గల సామాజిక, ఆర్థిక శక్తి ఏమిటో తెలిసింది. దాని గౌరవ ప్రతిష్టలను పెంచడానికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలి?

జ : ఇవాళ చాలా ఆలస్యమైంది. భోజనం తర్వాత అందరూ ఇళ్లకు వెళ్లండి. తిరిగి ఎల్లుండి చెనిగిచెర్లలో రైతుల ధర్నాలో కలుసుకుందాం!

# లోకవిద్య-సంస్కృతి

చెనిగిచర్ల మండలంలో కొన్ని గ్రామాల రైతులు జాతీయ రహదారిపైన "రాస్తారోకో" కార్యక్రమం మొదలు పెట్టారు. ట్రాఫిక్ స్తంభించిపోయింది. తమ వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మూల్యం, నీరు, విద్యుత్తు సరఫరాలు వారి డిమాండ్లు ఒకరి తర్వాత ఒకరు రైతులు వచ్చి ప్రసంగిస్తున్నారు. మన కార్యకర్త, ప్రశ్నకర్తలు కూడా రైతులతోపాటు ధర్నాలో పాల్గొనడం జరిగింది. అప్పుడే ఒక రైతు వినసొంపుగా రైతుల కష్టాలను వర్ణిస్తూ గట్టిగా ఒక పాట పాడాడు.

జ : చూడండి! లౌడ్ స్పీకరు లేకుండానే అందరికీ వినపడేలా ఎలా పాడగలగాడో!! భావాన్నీ పదాల్నీ మేళవిస్తూ రైతు కుటుంబం పరిస్థితులను కళ్లకు గట్టినట్లు వర్ణించడం నిజంగా ఒక గొప్ప కళ!

ప్ర : గ్రామాల్లో అడవుల్లో ఇటువంటి కళలు ఎన్నో దిక్కులేని పరిస్థితిలో వున్నాయి. కానీ మీరు మొన్న చెప్పినట్లుగా ఇటువంటి అపురూప కళారూపాలన్నిటినీ మన నుంచీ దూరం చేసి అమ్మకానికి పెట్టే ప్రమాదం నాకు కనిపిస్తోంది.

జ : నిజంగానే అటువంటి భయంకర పరిస్థితి వచ్చేలా వుంది. అయితే కొంతకాలం ఓడిపోయినా, అణగిపోయినా లోకవిద్యకు మరణం లేదు. అందువల్ల లోకవిద్యాధరులందరూ తలచుకుంటే దుష్టశక్తులని ధీటుగా ఎదుర్కొనగలరు. ఇవాళ మనం లోకవిద్యకు గల సాంస్కృతిక శక్తి గురించి మాట్లాడుకుందాం!

ప్ర : అవును బాగుంటుంది. చెప్పండి.

జ : లోకవిద్య అంతమైపోతుందన్న భయం నిరాధారమైంది. దానికి చావులేదు. అది వివిధ రూపాల్లో ప్రకటితమవుతుంది. అది అంతరించిపోతుందన్న సాకుతోనే దాన్ని కంప్యూటర్లలో బంధించడానికి ఏకాభిప్రాయ సాధన జరిగింది.

ప్ర : లోకవిద్యలోని సాంస్కృతిక శక్తిని ఎలా తెలుసుకోగలము?

జ : నేనూ, అందరమూ దీని గురించి ఆలోచించి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ఇప్పుడే ఆ పని ప్రారంభిద్దాం. లోకవిద్యలో నిరంతరం సత్యాన్ని గురించి నిర్మాణ , పునర్నిర్మాణ కార్యక్రమాలకు పెద్దపీట వుంటుంది. సైన్సులో సత్యం ఏమిటో అన్న అన్వేషణకే ప్రాధాన్యం వుంటుంది గానీ దాని నిర్మాణం కోసం కాదు. దీని వల్ల మన ఆలోచనా విధానం మొత్తం మారుతుంది.

ప్ర : కొద్దిగా విపులంగా చెప్తారా?

జ : లోకవిద్యలో సత్యం అనేది ప్రజల మధ్య వారి జీవన విధానంలో వుంటుంది. సత్యం అనేది ఒక వస్తువు కాదు. అందువల్ల ఇందులో వింతలకు, విశిష్ట శక్తులకు చోటులేదు. అట్లాగే దాన్ని వెతికి పట్టుకోడానికి ప్రత్యేకమైన కృషి కూడా అవసరం లేదు. అది సామాన్య జీవనంలో వుంటుంది. అంటే జీవితావసరాలు, అనుభవాలు, వేదనల మాధ్యమంలో దాని నిర్మాణ, పునర్నిర్మాణాలు జరుగుతాయి.

ప్ర : మీరు చెప్పిన దాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?

జ : మన సంప్రదాయంలోనే వుంది. యుగపురుషులు, పండితులు బాబాలు ఎంత మంది వచ్చినా అందరూ చెప్పేది ఒకటే సామాన్యుడి బతుకే సత్యం అదే దైవం అని. బుద్ధుడు కబీర్‌దాస్, రామదాసు మొదలుకొని గాంధీ మహాత్ముని వరకూ అందరూ ఈ సత్యం పునర్నిర్మాణానికే కృషి చేశారు. వీరందరి నేతృత్వంలో ప్రజలు లోకవిద్యకు నవ్యత్వాన్నిస్తూ సమాజంలోని దుష్టశక్తులతో యుద్ధం కూడా చేశారు.

ప్ర : మీరు చెప్పింది ముమ్మాటికీ నిజం. మన సంప్రదాయాన్ని ఈ విధంగా అర్థం చేసుకోడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఎప్పుడూ మన బలహీనతలు మూఢనమ్మకాలు, మత దురహంకారం ఎత్తి చూపే చదువులే నేర్చుకున్నాము. మన బలాలను గుర్తించే విద్య లభించలేదనే చెప్పాలి. ఇందాక మీరు సత్యం పట్ల సైన్సుకి లోకవిద్యకి అవగాహనల మధ్య తేడా వుందని చెప్పారు. అది ఎలా వుంటుంది?

జ : లోకవిద్యలో సత్యం ఎక్కడో బయట వుండదు. ప్రజల మధ్య వారి జీవన విధానంలో వుంటుంది. దాన్ని చూడాలన్నా, పొందాలన్నా ఇతరుల మీద ఆధారపడవలసిన అవసరం ఉండదు. ఒక సామాన్య వ్యక్తి కూడా దీనిని పొందగలడు. దాని పునర్నిర్మాణానికి కారకుడు అవగలడు. కానీ సైన్సులో అలాకాదు. దాన్లోని సిద్ధాంతాలు, ప్రయోగాలు ప్రకృతికీ, సామాజిక పరిస్థితులకీ అతీతంగా కొన్ని ప్రత్యేక సందర్భాలకే సరిపోతాయి. దీనిని ప్రత్యేక శిక్షణ పొందిన నిపుణులు మాత్రమే చేయగలుగుతారు. దీని ప్రకారం సత్యం సామాన్యవ్యక్తి పరిధిలో వుండదు. దాని వల్ల తన పరిస్థితుల్లో మార్పు తెచ్చే సత్తా సామాన్య మానవుడిలో వుండదు. ఇటువంటి విలువల్ని సైన్సు పెంపొందించడం చేస్తుంది. ఇదే విలువలు నేడు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, ఆరోగ్య, విద్య, పరిపాలనా రంగాల్లో బలంగా వుండడం చూడవచ్చును.

ప్ర : మన అభివృద్ధి మార్గం మన చేతుల్లో కాక ఇతరుల చేతుల్లో వుండడం మనకు వ్యతిరేకంగా జరిగే కుతంత్రంగా భావించాలి

జ : రెండు విభిన్న సంప్రదాయాల మధ్య సత్యాన్ని గురించిన దృక్పథంలో తేడాలున్నాయని గుర్తించి, దాని వల్ల సామాజిక సాంస్కృతిక రంగాల్లో కలిగే ప్రభావాలను అర్థం చేసుకోవాలి.

ప్ర : సైన్సులో ఇటువంటి విలువల పరిణామంగా సమాజంలో పరాన్న ప్రవీణులనే ఒక జాతి జన్మించింది.

జ : అవును. ఇంతే కాకుండా సామాన్య ప్రజలను తెలివితక్కువ వారిగానూ, మూర్ఖులుగానూ చూసే విలువలు బలపడ్డాయి. స్కూళ్ళు, కాలేజీల్లో సైన్సు ఆధారంగా చదువు మొదలవడంతోనే సామాన్య ప్రజలు తెలివితక్కువ వారనే ప్రచారం ఊపందుకుంది. పెద్దఎత్తున అసమానతలకు దారి తీసింది. సమాజానికి కూడు, గుడ్డ, నీడ అందించే అసంఖ్యాక ప్రజానీకం ఒక్క క్షణంలో తెలివితక్కువ

వారయిపోయారు. ప్రభుత్వాలు కూడా దీనిని సమర్థించాయి.

ప్ర : అంటే లోకవిద్యాధరుల అణచివేత కేవలం ఆర్థిక, సామాజిక రంగాలకే కాకుండా, సాంస్కృతిక విద్యా రంగాలకు కూడా విస్తరించిందన్నమాట.

జ : దీనిని బట్టి లోకవిద్య ఎంత పెద్ద సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందో మీకు అర్థమయ్యే వుంటుంది. ఇంకొక విషయం ఏమిటంటే లోకవిద్యలో జ్ఞానం నైతిక విలువలతో నిండి వుండటం సైన్సు మొదటి నుంచీ నైతిక విలువలకు, మనిషి పరిస్థితులకు అతీతంగా వృద్ధి చెందింది. అందు వల్ల సైన్సు ఆధారంగా పెరిగిన సమాజాల్లో సంస్థలు, ఆలోచనలు, విలువలు మనిషి పడే ఆవేదనకు సృజనాత్మక శక్తికీ అవకాశావివ్వదానికి సంశయిస్తాయి. బైటనుండీ మనిషిని నియంత్రించే వ్యవస్థలవైపే మొగ్గు చూపిస్తాయి. కానీ లోకవిద్యలో స్వపరిపాలన, స్వదేశీ, సత్యాగ్రహం, నిగ్రహం వంటి విలువలే ప్రాధాన్యత వహిస్తాయి. దీనివల్ల మనిషి తనపై నియంత్రణ తానే చేసుకోగలదు. తనకుతానే మహారాజయ్యే అధికారం లభిస్తుంది.

ప్ర : రెంటికీ ఎంత తేడా!! మన దేశంలో ఎంతమంది మతగురువులు, ఎన్ని భాషల్లో రాసినా బోధించినా అన్నిట్లో ఒకటే స్వరం ఎందువల్ల వుందో నాకిప్పుడు అర్థమైంది. వారి ప్రకారం సత్యం, ఈశ్వరుడు లేక భగవంతుడు మన మనస్సుల్లోనే వుంటాయి. వాటికోసం బయట ఎక్కడో వెదకవలసిన అవసరం లేదు. మనలోనే వున్నాయనటంలో వ్యక్తిగతం కాకుండా సామాన్య జీవన విధానంలో వున్నాయని అర్థం. ఆ సజ్జనులందరూ లోకవిద్య ఆధారితమైన జీవన సరళినే అనుసరించారు. అంటే ప్రతి వ్యక్తికీ సంపూర్ణ విజ్ఞానంపైన అధికారం వుందని వారు బోధించారనడం తప్పుకాదుకదా!

జ : అస్సలు తప్పుకాదు. సృజనాత్మకతకీ చదువుకీ మధ్య ఎంతో తేడా వుందని కూడా మనం గుర్తించాలి. సత్య నిర్మాణానికి సృజనాత్మకత ఎంతో అవసరం.

చదువు అనేది విజ్ఞానాన్ని సంఘటితం పరచడానికి ఒక యోగ్యత మాత్రమే. సృజనాత్మకత వున్న వారు వైతాళికులు అయితే చదువుకున్న వారు కేవలం సంగ్రహకర్తలుగానో సమీక్షకులుగానో మిగిలిపోతారు. అందువల్ల లోకవిద్యాధరులందరూ నవయుగ వైతాళికులే! స్కూళ్ళు, కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో లభించే చదువులు మనని కేవలం చదువుకున్న వారిగా తయారు చేస్తాయి.

ప్ర : చాలా చక్కగా తేడాని వివరించారు. ఏదన్నా ఒక సమాజంలోని సభ్యత అత్యున్నత స్థానాన్ని పొందాలంటే నిస్సందేహంగా వైతాళికులే కావాలి. కానీ ఎంత మంది దీనిని గుర్తిస్తారు?

జ : కళారంగంలో దీనిని చాలా స్పష్టంగా చూడవచ్చును. కళాకారుడు తన కళా నైపుణ్యం ద్వారా సత్యాన్ని నిర్మించుకుంటాడు. ఇప్పటికీ స్కూల్లో గానీ, కాలేజీలోగానీ చదువుకోని వాళ్లలోనే ఎక్కువమంది కళాకారులు కనిపిస్తారు. సాహిత్యం, సంగీతం, నాట్యం, చిత్రకళ, శిల్పకళారంగాల్లో ఈ విషయాన్ని చూడవచ్చును. లోకవిద్యలో కళారూపాల నకలు రూపాలు (కాపీలు) వుండవు. భావం, నైతిక విలువలు, సంవేదనలకు లోకవిద్యలో అత్యున్నత స్థానం లభిస్తుంది. కళల్లోని సౌందర్యానుభూతి కేవలం ఇంద్రియసుఖాలకే పరిమితం కాకుండా మనిషి నిజస్వరూపాన్ని తెలియపరిచే విధంగా వుంటుంది. కళాసాధనలో వున్నపుడు ఒక విలక్షణమైన అనుభూతికి లోనవుతాడు. ఆ సమయంలో మనిషి పరిశుద్ధుడైపోతాడు. క్షణికమైన వ్యామోహం, దురాశ, ఈర్ష్య, ద్వేషం, వైరం మొదలైన వాటి నుంచి విముక్తుడవుతాడు.

ప్ర : అంటే అహంకార విముక్తి లభిస్తుందన్నమాట. ఇది అన్ని కళల్లో సాధ్యమేనా?

జ : సాధ్యమే. అయితే లోకవిద్య ప్రకారం ఈ విలక్షణ అనుభూతిని ప్రేక్షకులు శ్రోతలలో కూడా కలిగించగలిగేదే అత్యున్నత కళారూపం! కళాకార్యక్రమాలో

దాగివున్న ఈ విలువలే సామాజిక శక్తిని బలపరుస్తాయి. కళలు ఏ ఒకరికీ వ్యక్తిగత సంపద కాదు. జానపద కళల్లో ఎప్పుడూ దాని రచయిత ఎవరన్న విషయానికి ప్రాధాన్యత వుండదు. ఇవి ఎన్నడూ అహాన్ని పెంచేవిగా వుండవు. ఒక్క కళలేకాదు, వ్యవసాయం, ఆరోగ్యం, వృత్తి రంగాల్లో కూడా ఇది కనిపిస్తుంది. లోకవిద్యలో విజ్ఞానం మీద అందరికీ అధికారం వుంటుంది.

ప్ర : పెట్టుబడిదారీ వ్యవస్థలో జ్ఞానం వ్యక్తిగత విషయమా?

జ : అవుననే అనిపిస్తుంది. ఏ విధంగా సంపద వ్యక్తిగతమో పెట్టుబడిదారీ వ్యవస్థలో జ్ఞానం కూడా అలాగే! సైన్సులో పేటెంట్ల వ్యవహారం దీన్ని స్పష్టంగా చూపిస్తుంది. లోకవిద్యలో విజ్ఞానాన్ని అమ్ముకోవడం అనైతిక చర్య. అది ఒకరి సొంతం కాదు. సమాజం మొత్తానిది అవుతుంది. అందు వల్ల విజ్ఞానం ఎవరికీ సొంత పరిశ్రమగా మారకుండా సమాజ అభివృద్ధికి సహాయపడుతుంది. ఇటీవల స్కూళ్లు, ఆసుపత్రులు వినోద రంగాలు పెద్దవ్యాపారాలుగా మారటం వల్ల సమాజంలో అనైతిక సంస్కృతి వ్యాపిస్తుంది. ఇంకొక విషయం ఏమిటంటే ఈ సమాచార యుగంలో లోకవిద్య రూపాలన్నిటినీ కంప్యూటర్లలో భద్రపరచడం వల్ల దానిని కూడా ఒక కాలేజీ చదువులాగా మారుస్తున్నారు.

ప్ర : దీని వల్ల జరిగే నష్టం ఏమిటి?

జ : విలువలు లేని చదువులు మనుషలను దయ్యాలుగా మారుస్తాయి. మనుషుల మధ్య, మనిషికి ప్రకృతికీ  మధ్య సత్సంబంధాలను నెలకొల్పలేని చదువులు నిరుపయోగమైనవి. కానీ సమాచార యుగంలో ఈ విలువలకు ప్రాముఖ్యత లేదు. ఈ యుగంలో సమాచారమే పెద్దపెట్టుబడిగా మారిపోయింది. అన్ని రంగాల్లో లోకవిద్యకు గల అపారమైన విజ్ఞానాన్ని దోచుకోవడం మొదలైంది. (కంప్యూటర్లలో భద్రపరుస్తూ)

ప్ర : ఆ విజ్ఞానం అంతరించి పోకుండా వుంటానికే అలా చేస్తున్నారేమో?

జ : వాడుకునే ప్రజల మధ్య వున్నంత కాలం ఆ విద్య అంతరించిపోదు. లోకవిద్యాధరులకు ధనాశ చూపి, వారి కళలను, విజ్ఞానాన్ని తీసుకొని తమ పేరుతో పేటెంట్ చేసుకునే కార్యక్రమాలు దోపిడీ కాక ఇంకేమి అవుతాయి. ఆ తర్వాత అధిక ధనార్జన కోసం వీటిలో అశ్లీలత, అసహజత అన్నీ ప్రవేశిస్తాయి.

ప్ర : మరి లోకవిద్య సమాచార మాధ్యమాన్ని బహిష్కరించాలా?

జ : లోకవిద్యలో అటువంటి ఆలోచనలకు చోటులేదు. అదెప్పుడూ అహింస, సర్వమానవ సోదర భావాలనే పాటిస్తుంది. ఇతరులతో సత్సంబంధాలు పెంచుకోవాలనే చూస్తుంది గానీ ఎవరితోనూ శతృత్వాన్ని పెంచుకోదు. సైన్సు తన పట్ల విచక్షణా ధోరణిని ప్రదర్శించినా లోకవిద్య సమాచార మాధ్యమాల పట్ల అనుచితంగా ప్రవర్తించదు. కానీ అన్యాయాన్ని మాత్రం తప్పకుండా ఎదుర్కొంటుంది.

ప్ర : అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం ఎలా సాగిస్తుంది?

జ : లోకవిద్యకు వున్న అన్ని బలాలనూ ముందు గుర్తించగలిగితే, వాటిని సమైక్యం చేస్తూ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటానికి నాంది పలకవచ్చును.

ప్ర : అవును. నిస్సందేహంగా మార్గం కనిపిస్తోంది. అయితే లోకవిద్యలో లోపాలు లేవా? వాటిని నిర్మూలించరా?

జ : నిజమే లోపాలున్నాయి. కానీ వాటిని ఎత్తి చూపేకన్నా, మంచిని పెంచడం ద్వారా చెడును అంతం చేడం ముఖ్యకార్యక్రమంగా ఉండాలి. అయితే మానవత్వ విలువలు మంటగలిపే చెడ్డతనం పెట్టుబడిదారీ వ్యవస్థలో వున్నట్లుగా లోకవిద్యలో లేదు. ఇక అసలు విషయం ఏమిటంటే లోకవిద్య తన శక్తులన్నిటినీ సమైక్యం చేస్తూ రాజకీయ శక్తిగా ఎలా ఎదుగుతుందనేది. దీని గురించి మనం తదుపరి మీటింగులో మాట్లాడుకుందాం!!

# జ్ఞాన భరిత రాజకీయం

ఒక నెలరోజుల తర్వాత మన కార్యకర్త, ప్రశ్నకర్త బజార్లో కలుసుకున్నారు.

ప్ర : చాలా కాలమైంది మీరు కనబడి! బయటకు వెళ్లినట్టున్నారు!

జ : అవును. ఈ మధ్య ఏర్పాటవుతున్న ప్రత్యేక ఆర్థిక మండలాలు (ఎస్ఇజెడ్) చూద్దామని మిత్రులతో కలిసి వెళ్లివచ్చాము. అక్కడ రైతులను నిర్వాసానికి గురిచేయడంతో వారు విరోధిస్తున్నారు. ఇదంతా ఎటు పోతోందో తెలియడం లేదు. గత మీటింగులో అనుకున్న ప్రకారం మనం లోకవిద్య రాజకీయ శక్తిని గురించి మాట్లాడుకుందాం!

ప్ర : అది సామాజిక మార్పును తెచ్చే శక్తిగా ఎలా ఎదుగుతుంది?

జ : అదే పెద్ద ఛాలెంజ్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థలు, ఆలోచనాలే నడుస్తున్నాయి. చివరికి కమ్యూనిస్టు దేశాల్లో కూడా ఇదే పరిస్థితి. కానీ ప్రపంచవ్యాప్తంగా పేద జనం లోకవిద్య సహాయంతోనే బతుకు వెళ్లదీస్తున్నారు. ప్రపంచంలో ఏమూల చూసినా లోకవిద్య వుంటుంది. వేర్వేరు ప్రదేశాల్లో వేరు రూపాల్లో వున్నప్పటికీ విలువలు, తర్కం చూస్తే అన్నిట్లో ఏకత్వం కనిపిస్తుంది. అందువల్ల విశ్వజనీన రూపంతో ప్రతి ప్రాంతంలో మనిషికి స్వయాధికారాన్ని కట్టబెట్టగలిగే శక్తిగా ఎదగగలదు.

ప్ర : ఒకప్పుడు సోషలిజం సమాజంలో మంచి మార్పులు తెస్తుందన్న నమ్మకం వుండేది. కానీ ఇప్పుడు మాత్రం లోకవిద్యకున్న గొప్పదనం చూస్తే ప్రపంచంలోని అనేక సమాజాల ఐక్యతకు అదే తగిన శక్తి అనిపిస్తోంది.

జ : దాన్ని గుర్తించవలసిన అవసరం చాలా వుంది. ప్రపంచవ్యాప్తంగా లోకవిద్యాధరుల పట్ల వ్యక్తమవుతున్న నిర్లక్ష్యం దోపిడీలను గుర్తించాలి. లోకవిద్యకున్న బలాన్ని గుర్తించి, అందరూ కలిసి విముక్తి మార్గంలో పయనించాలి. మానవ సమాజానికీ, ప్రకృతికీ పట్టిన దారిద్ర్యం అనే మహా వ్యాధినుంచి రక్షించే ఔషధం వీరివద్దనే వుంది.

ప్ర : ఎలా ముందుకు పోవాలి?

జ : సామాజిక తారతమ్యాలు, ఆర్థిక దోపిడీ, వెనుకబాటుతనం, రాజకీయ దాస్యం,

సాంస్కృతిక రాచరికం నుండి విముక్తి కావాలంటే పరిజ్ఞాన రాజకీయమనే (నాలేడ్జి పాలిటిక్స్) చొరవ తీసుకోవాలి.

ప్ర : దీని అర్థం వివరించండి?

జ : సమాచార యుగం తన పబ్బం గడుపుకోడానికి విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణాన్ని ఎప్పుడూ ముందుకు తీసుకువస్తుంది. దీనిలో భాగంగానే కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, మొబైల్‌ఫోన్ల వాడకం విపరీతంగా పెరిగింది. ఇక ఇ–వ్యాపారం, ఇ–ప్రశాసనం, ఇ–అమ్మకాలు, ఇ–సమావేశాలు మొదలైన వాటితోనే ఇది సాధ్యమన్న ప్రచారం జరుగుతోంది. కానీ నిజానికి ఇది సామాన్య మానవుడిని తన పరిజ్ఞానాన్నించీ, దాని వాడకాన్నించీ వంచించడమే!

ప్ర : అది ఎలా?

జ : కొన్ని ఉదాహరణలు తీసుకోండి. ఇప్పుడు చదువు అనేదానికి చాలా డబ్బు అవుతోంది. సామాన్యుడికి అందనంత ఎత్తులో వుంది. అలాగే కంప్యూటర్ల వాడకం, వాటి గురించి పరిజ్ఞానం కూడా అందరికీ అందుబాటులో లేవు. ఆ రంగానికి సంబంధించిన ఉద్యోగాలకు ఎక్కువ జీతాలు లభిస్తున్నాయి. వ్యవసాయం, చేతివృత్తులు, పశుపోషణ, హార్టికల్చర్, చిన్న దుకాణాల వ్యాపార రంగాల్లో సరియైన ఆర్థిక పరిస్థితులు లేవు. పేటెంట్ల ద్వారా, కంప్యూటర్లలో సంగ్రహపరచడం ద్వారా లోకవిద్యపై పెట్టుబడిదార్లు ఉచ్చు బిగిస్తున్నారు. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ సర్వీసులే!! వార్తలు, చదువులు, లైబ్రరీలు, పరిశోధనలు, సమాచారం వంటి వాటి కోసం ఇంటర్నెట్ వాడకం వల్ల సమాజంలో అధికభాగం ప్రజలు వీటికి దూరమయ్యారు.

ప్ర : అయితే ఈ రంగాల్లో వీటి పట్ల వ్యతిరేకత కూడా కనిపిస్తోంది కదా !

జ : అవును. మనదేశంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో రైతులు, గిరిజనులు, చిన్న వ్యాపారస్తులు, చేతివృత్తుల వారు, విద్యార్థులు, మేధావులు ఎన్నో రకాల ఆందోళనలు చేస్తూ రచనాత్మక కార్యక్రమాలు చేపడుతున్నారు. కానీ ఇవన్నీ చెదురుమదురుగా జరుగుతుండడం వల్ల కేవలం తమను రక్షించుకునే ఆందోళనలుగా మిగిలిపోతున్నాయి. ఈ సమాహారానికి సూత్రంగా వుండగలిగేది పరిజ్ఞాన రాజకీయం ఒక్కటే.

ప్ర : అవును ఇది సంభవమే. కానీ అది ఎలా వుంటుంది.? కొత్త పార్టీగానా?

జ : ఇప్పుడు పార్టీ రాజకీయాలు ఎంత కుళ్లిపోయాయో చూసిన తర్వాత అటువంటి ఆలోచనలే రావు. పార్టీ రాజకీయాల ద్వారా లభించే అధికారం పేదలకు సహాయపడుతుందనీ, పెట్టుబడుల బలానికి లొంగిపోదనీ ఊహించలేము. అధికార కేంద్రీకరణ వున్నంతసేపూ పెట్టుబడుల కేంద్రీకరణ తప్పదు. అందువల్ల పేదప్రజల పార్టీలు కూడా ఈ పార్టీ రాజకీయాల్లో ఏమీ చెయ్యలేవు.

ప్ర : మరి మీరు చెప్పిన పరిజ్ఞాన రాజకీయం ఏమి చెయ్యగలదు?

జ : విజ్ఞానం సమాజానికి ఉపయోగపడాలనీ, అది ఏ కొందరి సొత్తో కాదనీ, కేవలం లాభాలకే వాడకూడదనీ, అసలు అది ప్రజలందరిదీ అని వాడవాడలా ప్రచారం చేస్తుంది. ఇక లోకవిద్యాధరులందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపటం, వారికున్న ఆర్థిక, సామాజిక, ఆలోచనాశక్తి గుర్తించేట్లు చేస్తూ నవ సమాజ నిర్మాణానికి పురిగొల్పడం వంటి వినూత్న కార్యక్రమాలకు ప్రోత్సాహాన్నిస్తుంది. వివిధ ప్రదేశాల్లో జరిగే ఆందోళనా కార్యక్రమాల్లో జ్ఞానానికున్న ప్రాముఖ్యతను వివరిస్తూ ఒక కొత్త చైతన్యం కలుగచేయడం, ఒక కొత్త ప్రగతి మార్గం చూపించే ప్రయత్నం చేపడుతుంది.

ప్ర : కానీ ఇవన్నీ జరగాలంటే ఒక సంస్థ కావాలి గదా?

జ : అవును ఎంతో అవసరం. కానీ అటువంటి సంస్థలుగానీ, రచనాత్మక కార్యక్రమాలు గానీ లోకవిద్యాధరుల మధ్యనుంచే జన్మించాలి. వారి పోరాటాలు, జీవన విధానాలే అటువంటి వ్యవస్థలకు ఊపిరిపోయాలి. నేను ప్రస్తుతం అటువంటి సంస్థకు సంబంధించిన వాడినే సారనాథ్ (వారణాసి)లోని విద్యాశ్రమం ఇటువంటి ఆలోచనలతో రచనాత్మక కార్యక్రమాలు చేస్తోంది. ప్రపంచంలో ఇతర ప్రదేశాల్లో కూడా ఈ మాదిరిగా జరుగుతూ ఉండాలి.

ప్ర : దీన్ని గురించి మరింత వివరంగా తెలుసుకోడానికి విద్యా ఆశ్రమానికి వస్తాను.

జ : తప్పకుండా రండి. మీకిదే మా ఆహ్వానం.!!



సమాచార మాధ్యమాల చక్రబంధంలో

చిక్కుకుపోయిన ప్రపంచ భవిష్యత్తు ఏమిటి?

మానవ సమాజానికి విముక్తి ఎలా లభిస్తుంది.